


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

## విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 23.05.2026 | సంపుటి: 3 | సంచిక: 111 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SATURDAY | 23.05.2026 | VOLUME : 3 | ISSUE : 111 | PAGES: 8 | COST: 2/- |

# బీఆర్ఎస్‌లో సభ్యత్వ కలకలం

ఇన్చార్జ్‌ల నియామకాలతో నేతల్లో పెరుగుతున్న టెన్షన్




- సభ్యత్వ నమోదు పేరుతో కొత్త రాజకీయ సమీకరణాలా?
- టిక్కెట్ ఆశావహులకే బాధ్యతలు అప్పగించారన్న చర్చ
- కొన్ని నియోజకవర్గాల్లో స్థానిక నేతల్లో పెరుగుతున్న అసంతృప్తి
- కేసీఆర్ వ్యూహంపై పార్టీలో భిన్నాభిప్రాయాలు
- ఇన్చార్జ్‌లే రేపటి అభ్యర్థులా..? అంటూ జోరుగా ప్రచారం

**హైదరాబాద్, మే 22 (రాజముద్ర న్యూస్):** బీఆర్ఎస్‌లో సభ్యత్వ నమోదు ప్రక్రియ కొత్త రాజకీయ చర్చలకు దారితీస్తోంది. పార్టీ బలోపేతం లక్ష్యంగా ప్రారంభిస్తున్న సభ్యత్వ నమోదుకు ప్రత్యేక ఇన్చార్జ్‌లను నియమించడంతో కొన్ని నియోజకవర్గాల్లో స్థానిక నేతల్లో ఆందోళన పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా టిక్కెట్ ఆశావహులకే సభ్యత్వ బాధ్యతలు అప్పగించడంపై పార్టీలో అంతర్గత చర్చ సాగుతోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీని మరింత బలోపేతం చేయాలని భావిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇప్పటికే జిల్లా కోఆర్డినేటర్లను నియమించారు. తాజాగా నియోజకవర్గాల వారీగా సభ్యత్వ నమోదు ఇన్చార్జ్‌లను ఖరారు చేశారు. అయితే ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేలు, రెగ్యులర్ నియోజకవర్గ ఇన్చార్జ్‌లకు కాకుండా కొత్తవారికి బాధ్యతలు

మిగతా 3వ పేజీలో..






## భానుడి భగభగకు పెరిగిన విద్యుత్ వినియోగం!

- హైదరాబాద్‌లో రికార్డు స్థాయి డిమాండ్
- 21న 4766 మెగావాట్లకు చేరిన గరిష్ట వినియోగం
- ఇప్పటివరకు నమోదైన అత్యధిక డిమాండ్ ఇదే
- 100 మిలియన్ యూనిట్లకు పైగానే విద్యుత్ వాడకం
- గత ఏడాది కన్న వెయ్యి మెగావాట్లు అధికం
- 20శాతానికి పైగా పెరిగిన విద్యుత్ వినియోగం

**తెలంగాణ బ్యూరో, మే 22 (రాజముద్ర న్యూస్):** సూర్యుని ప్రతాపానికి జనం విలవిలలాడుతుంటే ఉక్కపోత ఉపశమనానికి విద్యుత్ కు విపరీతమైన డిమాండ్ పెరిగింది.ఈ నెల 21న విద్యుడ్ డిమాండ్ 4,766 మెగావాట్లకు చేరుకుని రికార్డు నమోదు చేసింది. గ్రేటర్ హైదరాబాద్‌లో ఈ ఏడాది ఏప్రిల్, మే నెలలో నాలుగు వేల మెగావాట్లకు తగ్గకుండా డిమాండ్ నమోదు అవుతుంది. గురువారం మధ్యాహ్నం విద్యుత్ డిమాండ్ 4,766 మోగావాట్లకు చేరుకోవడంతో ఇప్పటి వరకు గ్రేటర్ పరిధిలో ఇదే అత్యధిక రికార్డు డిమాండ్‌గా నమోదు కావడం గమనార్హం. ఈ ఏడాది

మిగతా 3వ పేజీలో..




## రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు: కవిత

- సచివాలయం వద్ద టీఆర్ఎస్ భారీ ఆందోళన
- రోడ్డుపై ధాన్యం పోసి వినూత్న నిరసన
- వరికి రూ.500 బోనస్ ఇవ్వాలంటూ డిమాండ్
- కొనుగోళ్లలో జాప్యంపై ప్రభుత్వంపై మండిపాటు
- ఉద్రిక్తత మధ్య కవిత, కార్యకర్తల అరెస్ట్

2

## నిందితుడిని దాచి ఉంచిన నేరం రేవంత్‌దే

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

### రైతుల కష్టాలు కనిపించడం లేదా..?

- ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వానికి కేటీఆర్ సవాల్

2




మిగతా 2 లో

## 2,000 కిడ్నీ మార్పిడులతో అరుదైన రికార్డు

- 'నిమ్స్' వైద్య బృందానికి సీఎం అభినందనలు

**హైదరాబాద్, మే 22 (రాజముద్ర న్యూస్):** హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్‌లో దేశంలోనే అరుదైన రికార్డు నమోదు చేసింది. 'నిమ్స్' యూరాలజీ విభాగం ఇప్పటివరకు 2,000 కిడ్నీ మార్పిడులు పూర్తి చేసి దక్షిణ భారత దేశంలో నెంబర్ వన్‌గా నిలిచింది. దేశంలో కిడ్నీ

మిగతా 2వ పేజీలో..



## ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ వ్యాపారం



3

- బీఆర్ఎస్ రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు
- మాజీ మంత్రి హరీష్ రావు హెచ్చరిక

### సీఎం రేవంత్ కు విజన్ లేదు

3



2

## సంత్ సేవాలాల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌కు వినతి

- లంబాడ ప్రజాప్రతినిధుల బృందం ముఖ్యమంత్రితో భేటీ
- ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్



## సంక్షేమం, మూసీ పునరుజ్జీవం ప్రథమ ప్రాధాన్యతలు

- 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- తెలంగాణ వృద్ధి రేటు 10.7 శాతం
- పట్టణీకరణతో సేవల రంగానికి భారీ అవకాశాలు
- విద్యార్థుల రుణాలు భవిష్యత్తు పెట్టుబడులు
- వడ్డీ లేని రుణాలు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు
- బ్యాంకర్ల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్, మే 22 (రాజముద్ర న్యూస్) :** సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతలను ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ 2047

మిగతా 3వ పేజీలో..




## గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి

- వ్యవసాయాధార పరిశ్రమలకు రుణాలు పెంచాలి
- సంప్రదాయ వ్యవసాయ రుణాలకే పరిమితం కారాదు
- బ్యాంకర్ల సమావేశంలో మంత్రి తుమ్మల సూచన

**హైదరాబాద్, మే 22 (రాజముద్ర న్యూస్) :** రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో బ్యాంకులు చురుకైన భాగస్వాములు కావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రజా భవన్‌లో శుక్రవారం

మిగతా 2వ పేజీలో..



## శంషాబాద్‌లో హైడ్రా మెరుపు దాడులు

- ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం
- ఎయిర్‌పోర్ట్ సమీపంలో అక్రమ కట్టడాల కూల్చివేత
- బుల్డోజర్లతో నిర్మాణాలు నేలమట్టం చేసిన హైడ్రా
- భారీ పోలీస్ బందోబస్తు మధ్య కొనసాగిన చర్యలు

3



## భానుడి భగభగ!

- తెలుగు రాష్ట్రాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు
- పిడుగురాళ్లలో 48.1 డిగ్రీల రికార్డు
- తెలంగాణలో పెద్దపల్లి, మునగాలలో 46.5 డిగ్రీలు
- ఏపీ, తెలంగాణలో రెడ్ అలర్ట్ కొనసాగింపు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక

2

## నిందితుడిని దాచి ఉంచిన
# నేరం రేవంత్‌దే

**హైదరాబాద్, మే 22 :**

తనకు అన్యాయం జరిగిందని ఓ ఆడబిడ్డ బయటకు వస్తే ఆ కుటుంబాన్ని బెదిరించి కౌంటర్ కేసు పెట్టించి నిందితుడిని తొమ్మిది రోజులు కాపాడింది ముమ్మాటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తనకు అన్యాయం జరిగిందని మైనర్ బాలిక తల్లిదండ్రులతో పోలీస్ స్టేషన్‌కు వెళ్తే అర్ధరాత్రి వరకు నిలబెట్టి తీవ్ర ఆవేదనకు గురిచేసింది రాష్ట్ర ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. నిందితుడికి బెయిల్ ఇవ్వనని హైకోర్టు తెగేసి చెప్పడం, రాష్ట్రంలోని ప్రతీ ఆడబిడ్డ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోయడంతోనే దిక్కులేని పరిస్థితుల్లో నిందితుడిని అరెస్టు చేశారన్నారు. రాష్ట్ర హోం శాఖకు బాధ్యుడిగా ఉన్న ముఖ్యమంత్రి.. ప్రధాన మంత్రి పర్యటన వల్ల పోలీసులంతా బిజీ ఉన్నారని అడ్డగోలు సాకులు చెప్పేందుకు సిగ్గుపడాలన్నారు. అత్యంత సున్నితమైన ఈ విషయంలో పార్టీ తరఫున మౌనంగా ఉన్నామని, ఏనాడూ రాజకీయం చేయలేదని కేటీఆర్ తెలిపారు. కానీ ముఖ్యమంత్రి తమపై విమర్శలు చేసిన తర్వాతనే తప్పని పరిస్థితుల్లో మాట్లాడాల్సి వస్తున్నదన్నారు. ముఖ్యమంత్రి పోక్సో కేసు నిందితుడిని తొమ్మిది రోజులు దాచిపెట్టిన సందర్భం ఎక్కడైనా ఉన్నదా అన్న విషయంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు, రేవంత్ రెడ్డికి ఉన్న అనుబంధం వల్లనే ఇద్దరూ కలిసి నిందితుడిని తొమ్మిది రోజులు దాచి ఉంచారని కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి సన్నిహితుడి హాస్పిటల్‌లో తొమ్మిది రోజుల పాటు దాచిపెట్టారన్న వార్తలు వస్తున్నాయని, దీనిపై ప్రభుత్వం విచారణ చేయాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ కొడుకుతో తనకు సంబంధం లేదని కోర్టు ద్వారా ఆర్డర్ తెచ్చుకున్నాడని, అంతటి దుర్మార్గమైన పరిస్థితి ఏ తండ్రికీ రావద్దని కేటీఆర్ అన్నారు. ఒకవైపు తన కొడుకుతో సంబంధం లేదని చెప్తూనే తిరిగి తానే పోలీసులకు అప్పజెప్పానని అనడం ఏంటో సమాధానం చెప్పాలన్నారు. పోక్సో కేస్ నిందితులు తొమ్మిది రోజులు తప్పించుకోలేరని, కేంద్ర మంత్రి కొడుకు కావడం, ముఖ్యమంత్రి అండదండలు ఉండడం వల్లనే తప్పించుకున్నాడని కేటీఆర్ అన్నారు. ఈ అంశంలో పార్టీ జనరల్ సెక్రటరీ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అద్భుతంగా ప్రభుత్వాన్ని, మీడియాను అలర్ట్ చేశారని అభినందించారు. అలాంటి ప్రవీణ్ కుమార్ గురించి అడ్డగోలుగా మాట్లాడిన రేవంత్ రెడ్డి మాటల్ని కేటీఆర్ ఖండించారు. రేవంత్ రెడ్డి లాంటి దొంగ.. దొంగలను ఎలా పట్టుకోవాలో పోలీసులకు చెప్పినట్లు వచ్చిన వార్తలపై ఎద్దేవా చేశారు. ఈ కేసు విషయంలో హనీ ట్రాప్ అంటూ అడ్డగోలు వార్తలు రాసిన మీడియా, రాయించిన వ్యక్తులు ఎవరో సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి, బండి సంజయ్‌లు మీడియా కార్యాలయాలకు ఫోన్ చేసి కాళ్లావేళ్లా పడి వార్తలు రాకుండా ఆపింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడ ఆడబిడ్డలకు అన్యాయం జరిగినా కొట్లాడింది తామే అని, అది లగచర్ల మొదలుకొని అనేక అంశాల్లో తమ పార్టీ తరఫున కొట్లాడుతున్నామని చెప్పారు. బండి సంజయ్‌తో తనకు ఎలాంటి పంచాయితీ లేదని, ఆయన తన తండ్రి గురించి ఇష్టారీతి మాట్లాడినా ఏ రోజూ తాను స్పందించలేదని కేటీఆర్ తెలిపారు. ఈ రోజు కూడా బండి సంజయ్‌ను ఏమనడం లేదని, కేవలం నేరస్థుడు ఎవడైనా నేరస్థుడే అనే ఆలోచనతోనే మాట్లాడుతున్నామని అన్నారు. పోక్సో కేసు విషయంలో జరుగుతున్న అన్యాయంపైన ప్రశ్నిస్తే మా బావమరిది ఇంటిపైన డ్రగ్స్ దాడి జరిగింది అంటూ మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి కేసు ఎందుకు పెట్టడం లేదు అని, దమ్ముంటే కేసు పెట్టి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు

## రైతుల కష్టాలు కనిపించడం లేదా..?

**హైదరాబాద్, మే 22:**

“ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరుగుతున్నాయని నిరూపిస్తే ఎలాంటి శిక్షకైనా సిద్ధం” అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. రైతుల సమస్యలు, ధాన్యం కొనుగోళ్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకురావాలని తాను లేఖ రాశానని తెలిపారు. సీఎంకు డబ్బు సంచులపై ఉన్న దృష్టి ధాన్యం సంచులపై కూడా ఉంటుందని భావించానని, కానీ ఇటీవల సీఎం నిర్వహించిన ప్రెస్‌మీట్‌తో పరిస్థితి అర్థమైందని వ్యాఖ్యానించారు. పౌర సరఫరాల శాఖ మంత్రి వాస్తవాలకు విరుద్ధంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 45 డిగ్రీల ఎండల్లో రైతులు 45 రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఒకే రోజు నలుగురు రైతులు మరణించిన ఘటనలపై తమ పార్టీ నేతలు స్పందించారని తెలిపారు. రాష్ట్రంలో గన్నీ బ్యాగులు దొరకడం లేదని, కానీ గన్స్ మాత్రం దొరుకుతున్నాయని విమర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడా కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని ఆరోపించారు.

“స్థలం మీరు నిర్ణయించండి.. మేము వస్తాం. కొనుగోళ్లు సరిగా జరుగుతున్నాయని నిరూపిస్తే ఎలాంటి శిక్షకైనా సిద్ధం” అంటూ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

ఇప్పటివరకు ధాన్యం కొనుగోళ్లు 45 శాతం కూడా దాటలేదని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో మృతి చెందిన రైతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించేలా కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ అంశాలపై స్పందిస్తూ బీజేపీ-కాంగ్రెస్ కలిసి తెలంగాణలో ప్రభుత్వాన్ని నడుపుతున్నాయని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన వల్ల రైతులకు ఎలాంటి లాభం జరగలేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన విద్యుత్ శాఖ అధికారి

- **రూ.25 వేల లంచం స్వీకరిస్తుండగా పట్టివేత**
- **మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఏసీబీ దాడి**

**మెదక్, మే 22:**

మెదక్ జిల్లా నర్సాపూర్ విద్యుత్ విభాగంలో పనిచేస్తున్న అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కాడు. నర్సాపూర్ ఆపరేషన్స్ విభాగానికి చెందిన ఏడీఈ ముద్దం రమణారెడ్డి అధికారిక పనికి సంబంధించి రూ.25 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ విడుదల చేసిన వివరాల ప్రకారం, ఫిర్యాదుదారునికి సంబంధించిన 11 వర్క్ బిల్లులను మెదక్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయానికి ఫార్వర్డ్ చేయడానికి ముద్దం రమణారెడ్డి లంచం కోరినట్లు తెలిసింది. మొత్తం రూ.3,13,882 విలువైన బిల్లులను ముందుకు పంపేందుకు రూ.25 వేల రూపాయలు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదు అందుకున్న ఏసీబీ అధికారులు ప్రత్యేకంగా ఉచ్చుపన్ని శుక్రవారం మధ్యాహ్నం నర్సాపూర్ కార్యాలయంలో దాడి నిర్వహించారు. లంచం మొత్తాన్ని స్వీకరిస్తున్న సమయంలోనే అధికారిని అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద నుంచి రూ.25 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా ప్రజా విధులను నిజాయితీగా నిర్వహించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, అక్రమ లాభం కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోంది.ఫిర్యాదుదారుని వివరాలను భద్రతా కారణాల రీత్యా గోప్యంగా ఉంచినట్లు ఏసీబీ తెలిపింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరింది. వాట్సాప్, సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించింది.

# భానుడి భగభగ!

- **తెలుగు రాష్ట్రాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు**
- **పిడుగురాళ్లలో 48.1 డిగ్రీల రికార్డు**
- **తెలంగాణలో పెద్దపల్లి, మునగాలలో 46.5 డిగ్రీలు**
- **ఏపీ, తెలంగాణలో రెడ్ అలర్ట్ కొనసాగింపు**
- **ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక**

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్ :**

తెలుగు రాష్ట్రాలు నిప్పుల కుంపటిలా మారుతున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 8 గంటలకే సూర్యుడు సుర్రుమంటుండటంతో అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రావడం లేదు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పలు జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేయగా, మిగిలిన జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం నమోదైన ఉష్ణోగ్రతలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 48.1 డిగ్రీలు నమోదయ్యాయి. తెలంగాణలో పెద్దపల్లి జిల్లా ముత్తారం, సూర్యాపేట జిల్లా మునగాలలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

**200 మండలాల్లో 44 డిగ్రీలకు మించి..**

ఆంధ్రప్రదేశ్‌లో బాపట్ల జిల్లా వేటపాలెం, కృష్ణా జిల్లా నందివాడలో 47.6 డిగ్రీలు, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడు, ప్రకాశం జిల్లా అద్దంకిలో 47.4 డిగ్రీలు నమోదయ్యాయి. ఏలూరు జిల్లా అల్లిపల్లిలో 47.3 డిగ్రీలు, మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 46.6 డిగ్రీలు, పోలవరం జిల్లా కూనవరంలో 46.5 డిగ్రీలు, నెల్లూరు జిల్లా కావలిలో 46.4 డిగ్రీలు, గుంటూరు జిల్లా తెనాలిలో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా, 20 జిల్లాల్లోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఈ భీకర ఎండల తీవ్రత సోమవారం వరకు కొనసాగనున్నట్లు అధికారులు హెచ్చరిస్తున్నారు.

**తెలంగాణలో పరిస్థితి తీవ్రం**

తెలంగాణలోనూ ఎండలు దంచికొడుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లిలో 46.4 డిగ్రీలు, మహబూబాబాద్ జిల్లా కురవిలో 46.3 డిగ్రీలు, ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో 46.2 డిగ్రీలు, సిద్ధిపేట జిల్లా అక్కన్నపేట్‌లో 46.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 20 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటడంతో పరిస్థితి తీవ్రంగా మారింది. భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పగటి వేళల్లో బయటకు రావొద్దని వాతావరణ శాఖ సూచిస్తోంది.



# 2,000 కిడ్నీ మార్పిడులతో అరుదైన రికార్డు

**మొదటిపేజీ తరువాయి**

ట్రాన్స్ ప్లాంట్‌లో గుజరాత్‌లోని ఐకెడీఆర్‌సీ నెంబర్ వన్ స్థానంలో ఉంది. సెకండ్ ప్లేస్‌లో లూథియానా క్రిస్టియన్ కాలేజీ ఉండగా ‘నిమ్స్’ మూడో స్థానంలో ఉంది. ఈ అరుదైన మైలురాయిని సాధించి కిడ్నీ బాధితులకు విశేష సేవలు అందించిన ‘నిమ్స్’ వైద్య బృందానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ 2,000 మందిలో 1,900 మంది అంటే 95% మంది రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా కిడ్నీ మార్పిడి చేయించుకున్నవారు కావడం విశేషం. 2023 జనవరి నుంచి గడిచిన మూడేళ్ల నాలుగు నెలల్లోనే 500 కిడ్నీ మార్పిడులు చేసి ఈ హాస్పిటల్ రికార్డు నెలకొల్పింది.

**వైద్యులకు మంత్రి దామోదర్ అభినందన**

నిమ్స్ వైద్య బృందం సాధించిన ఈ ఘనత పట్ల ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందనలు తెలిపారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లోనూ అత్యాధునిక వైద్యం అందించగల సామర్థ్యం తెలంగాణకు ఉందని నిమ్స్ నిరూపిస్తోందన్నారు. ఇటీవల గాంధీ హాస్పిటల్‌లో ఆరు మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లతోపాటు అత్యాధునిక వసతులతో కూడిన ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. సనత్‌నగర్‌లోని టిమ్స్‌లో కూడా ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ ఎక్సలెన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్గాన్ రిట్రైవల్ సెంటర్లను సైతం అందుబాటులోకి తీసుకొస్తున్నామని మంత్రి వెల్లడించారు. దీంతో ప్రభుత్వ రంగంలోనే అత్యాధునిక అవయవ మార్పిడి సేవలు మరింత విస్తృతంగా అందుబాటులోకి వస్తాయన్నారు.

**యూరాలజీ, నెఫ్రాలజీ విభాగంతోనే సాధ్యమైంది : డైరెక్టర్ బీరప్ప**

దేశంలో రెండు వేల కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేసిన ప్రభుత్వ హాస్పిటల్‌గా ‘ నిమ్స్ ’ రికార్డు సృష్టించిందని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప శుక్రవారం ప్రకటించారు. నిమ్స్ యూరాలజీ, నెఫ్రాలజీ విభాగం డాక్టర్లు, సిబ్బంది అద్భుతమైన పనితీరుతోనే ఈ అచీవ్‌మెంట్‌ను సాధించగలిగామన్నారు. అవయవ మార్పిడి అనంతరం జీవితాంతం అవసరమయ్యే మందులను కూడా ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిమ్స్ యూరాలజీ విభాగం హెడ్, డాక్టర్ రాహుల్ రాజ్‌ను బీరప్ప అభినందించారు. యూరాలజీ విభాగం ఆధ్వర్యంలోనే ఈ ఘనత సాధ్యమైందని పేర్కొన్నారు. క్లిష్టమైన బహుళ రక్తనాళాల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు, చిన్నారుల్లో ట్రాన్స్‌ప్లాంట్లు, రీట్రాన్స్‌ప్లాంట్లు వంటి సవాలుతో కూడిన ఆపరేషన్లను యూరాలజీ టీమ్ విజయవంతంగా నిర్వహించిందన్నారు. దక్షిణ భారత దేశంలో ప్రభుత్వ హాస్పిటల్‌లో తొలి రోబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ కూడా నిమ్స్‌లోనే నిర్వహించడం విశేషమన్నారు.

## సంత్ సేవాలాల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌కు వినతి

**హైదరాబాద్, మే 22**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిను లంబాడ ప్రజాప్రతినిధుల బృందం శుక్రవారం జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి పలు కీలక అంశాలపై వినతిపత్రం అందజేసింది. లంబాడీల ఆధ్యాత్మిక గురువు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ పేరుతో ప్రత్యేకంగా “సంత్ సేవాలాల్ కార్పొరేషన్” ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కోరారు. లంబాడ సమాజ అభివృద్ధి, ఆర్థిక సాధికారత కోసం ఈ కార్పొరేషన్ కీలకంగా ఉపయోగపడుతుందని ప్రతినిధులు వివరించారు. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను విభజించి ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని కూడా బృందం విజ్ఞప్తి చేసింది. గిరిజనుల సమస్యలు, హక్కులు, సంక్షేమ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలంటే ప్రత్యేక కమిషన్ అవసరమని వారు పేర్కొన్నారు. ఎస్టీలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో వేగం పెరగడంతో పాటు పరిపాలనా స్థాయిలో మరింత ప్రాధాన్యం లభిస్తుందని వివరించారు. ఈ భేటీలో ఎంపీ బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్, ఎమ్మెల్యేలు మురళీ నాయక్, రాందాస్ నాయక్ పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ కూడా ముఖ్యమంత్రిని కలిసి తమ అభిప్రాయాలు వెల్లడించారు.

తెలంగాణ గిరిజన డెవలప్మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ట్రైకార్) చైర్మన్ బెల్లయ్య నాయక్ సహా పలువురు గిరిజన నాయకులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. లంబాడ సమాజానికి విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి రంగాల్లో మరింత ప్రోత్సాహం అవసరమని వారు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సంత్ సేవాలాల్ మహారాజ్ పేరు మీద కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే గిరిజన యువతకు ప్రత్యేక పథకాలు, స్వయం ఉపాధి అవకాశాలు, ఆర్థిక సాయం, శిక్షణ కార్యక్రమాలు అమలు చేయడానికి అవకాశం ఉంటుందని ప్రతినిధులు వివరించారు. సమాజ అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వారి వినతులను శ్రద్ధగా విన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. లంబాడ సమాజ అభివృద్ధికి సంబంధించిన అంశాలను పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

## రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు: కవిత

**హైదరాబాద్, :**

“రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదు” అని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిని నిరసిస్తూ హైదరాబాద్ సచివాలయం ప్రధాన ద్వారం వద్ద ఆమె భారీ ఆందోళన చేపట్టారు.

పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సచివాలయాన్ని ముట్టడించిన కవిత.. రాష్ట్రవ్యాప్తంగా ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు తీవ్రంగా ఆలస్యమవుతున్నాయని మండిపడ్డారు. రైతులు పండించిన పంటను వెంటనే కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

తేమ శాతం, తరుగు పేరుతో “కటింగ్స్” విధిస్తూ మిల్లర్లు, అధికారులు రైతులను నష్టపరుస్తున్నారని విమర్శించారు. వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించాలని, ఎలాంటి నిబంధనలు లేకుండా వెంటనే కొనుగోళ్లు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

జొన్నలు, పొద్దుతిరుగుడు వంటి ప్రత్యామ్నాయ పంటలకు కూడా MSP కల్పించాలని కోరారు. నిరసనలో భాగంగా సచివాలయం ప్రధాన ద్వారం ఎదుట రోడ్డుపై వరి ధాన్యాన్ని పోసి వినూత్నంగా ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో సచివాలయం వైపు వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయి భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. నిరసనకారులను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించడంతో తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు కవితతో పాటు పార్టీ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



## రేపు యాదగిరిగుట్టకు సీఎం రేవంత్ రాక

**యాదగిరిగుట్ట, మే 22:**

ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయ అభివృద్ధిలో భాగంగా సుమారు రూ.100 కోట్ల వ్యయం కాగల పనులకు శంకుస్థాపన చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం యాదగిరిగుట్ట విచ్చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. యాదగిరిగుట్ట టెంపుల్ సిటీ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, భద్రతా చర్యలు, పారిశుధ్య నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. అలాగే ముఖ్యమంత్రి రాక కోసం ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించి అక్కడ చేపట్టిన భద్రతా ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలకు సంబంధించిన మార్గదర్శకాలను అధికారులతో చర్చించి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అయిలయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. యాదగిరిగుట్టకు ముఖ్యమంత్రి రాకతో టెంపుల్ సిటీ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి

**మొదటిపేజీ తరువాయి**

నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ బ్యాంకర్లు కేవలం సాంప్రదాయ పంట రుణాలకే పరిమితం కాకుండా గ్రావి□ణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి రుణాల పంపిణీని భారీగా పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గ్రావి□ణ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ఇదే సరైన సమయమని, ఈ అవకాశాన్ని బ్యాంకులు ఉపయోగించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో క్రెడిట్`డిపాజిట్ నిష్పత్తి రికార్డు స్థాయిలో 130.78 శాతం నమోదు కావడం విశేషమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బ్యాంక్ డిపాజిట్లు రూ.9.43 లక్షల కోట్లుగా ఉంటే అడ్వాన్సులు (రుణాలు) రూ.12.33 లక్షల కోట్లకు చేరాయని, వ్యవసాయ రంగానికి రుణాల పంపిణీలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధించిందని తెలిపారు. నిర్ణీత లక్ష్యం కంటే ఎక్కువగా 102 శాతం ప్రగతిని నమోదు చేయడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో పంట రుణాల పంపిణీ రూ.75,486 కోట్లకు చేరిందని, వ్యవసాయ రంగానికి మొత్తంగా రూ.1.68 లక్షల కోట్ల రుణాలను బ్యాంకులు అందజేశాయని చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణ మాఫీ కార్యక్రమం వల్ల గ్రావి□ణ ప్రాంతాల్లో రుణ సంస్కృతి పునరుద్ధరణ జరిగింది. ప్రభుత్వ నిర్ణయాల వల్ల బ్యాంకులలో వ్యవసాయ నిరర్థక ఆస్తులు 5.23 శాతం నుంచి 4.71 శాతానికి తగ్గాయి. తెలంగాణలో ఉద్యానవన రంగంతోపాటు ఆయిల్ పామ్ సాగుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని మంత్రి అన్నారు. ఈ రంగాలకు బ్యాంకులు పెద్దపీట వేయాలని కోరారు. పంట నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు, సైలోల నిర్మాణానికి బ్యాంకులు ఉదారంగా రుణాలు ఇవ్వాలన్నారు. అలాగే రాష్ట్రంలో ఉన్న దాదాపు వెయ్యి రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు తగిన ఆర్థిక మద్దతు అందించాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని ఆధునికీకరించేందుకు, యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ.147.91 కోట్ల బ్జడెట్‌ను కేటాయించింది. కౌలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో పంట రుణాలు అందేలా బ్యాంకులు బాధ్యత తీసుకోవాలన్నారు. వీటితోపాటు పర్యావరణహితమైన సోలార్ వ్యవసాయం, మైక్రో ఇరిగేషన్ పద్ధతులకు రుణ సదుపాయాన్ని గణనీయంగా పెంచాలని మంత్రి తుమ్మల సూచించారు.

## ఫ్యూచర్ సిటీ పేరుతో
# రియల్ వ్యాపారం

**హైదరాబాద్, మే 22 :**

ఫ్యూచర్ సిటీ పేరుతో కాంగ్రెస్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని బీఆర్ఎస్ నేత టి.హరీష్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన కాంగ్రెస్ సర్కార్ చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఫార్మా సిటీకి మాత్రమే కేంద్ర పర్యావరణ శాఖ అనుమతి ఇచ్చిందని, డీవియేషన్ ఉంటే రైతుల భూములు వెనక్కి ఇవ్వాలని చట్టంలో ఉందని వెల్లడించారు. ఫార్మా సిటీని కొనసాగిస్తామని ఓ వైపు కోర్టుకు చెబుతూ రేవంత్ ప్రభుత్వం జిమ్మిక్కు చేస్తోందని విమర్శించారు. ఫార్మా సిటీ వస్తే దానికి అనుబంధంగా కనీస సౌకర్యాలు ఎడ్యుకేషన్, హౌసింగ్ రావాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. 75శాతం ఫార్మా సిటీ ఉండి 25శాతం మిగతావి ఉండాలన్నారు. కానీ 75 శాతం మిగతా వ్యాపారం చేసి కేవలం 25 శాతమే ఫార్మా వచ్చేలా చేస్తున్నారని ఆరోపించారు. ఇది చట్ట ప్రకారం చెల్లదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఫార్మా సిటీని రిస్టోర్ చేస్తామని స్పష్టం చేశారు. 'ఇది నా మాట కాదు.. పార్లమెంట్ చట్టం. ఫార్మా సిటీ వస్తే లక్ష□ మందికి ఉద్యోగాలు వస్తాయని తాము ప్రారంభించాం. మన దగ్గర నుంచి ఒక్క ఫార్మా కంపెనీ బయటకు వెళ్లొద్దని చేశాం. ఇప్పటికే రెండున్నరేళ్లు గడిచిపోయింది. ఆఖరు సంవత్సరం ఎన్నికల హడావుడి. రేవంత్ సర్కార్ ఏవి□ చేయలేదు. భూములు పంచి పెడితే బ్యాక్ ఎండ్ ఏదో లబ్ధి పొందాలని ప్లాన్ చేశారు అని ఆరోపించారు. ఫార్మా సిటీ అభివృద్ధి చెందితే బీఆర్ఎస్‌కు పేరు వస్తుందని ఇలా చేశారన్నారు. ఉన్నది ఉన్నట్టు అక్కడ ఫార్మా సిటీనే వస్తుంది అని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# సీఎం రేవంత్ కు విజన్ లేదు

- **ప్లాట్లు కొనాలంటే ఎన్నారైలే భయపడుతున్నారు**
- **పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనే తెలంగాణ ప్రగతి పథం**
- **అమెరికాలో మాజీ మంత్రి హరీష్ రావు 'మీట్ అండ్ గ్రీట్'**

**న్యూజెర్సీ, మే 21 :**

అమెరికా పర్యటనలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కీలక నేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావుకు న్యూజెర్సీలోని హల్దీ మౌంట్ లారెల్‌లో ప్రవాస భారతీయులు, బీఆర్ఎస్ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అక్కడ ఏర్పాటు చేసిన 'మీట్ అండ్ గ్రీట్ విత్ హరీష్ రావు' కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. బీఆర్ఎస్ నాయకుడు కర్నాటి విద్యాసాగర్‌తో పాటు ఎన్నారై ప్రతినిధులు మహేష్ తన్నీరు, నరసింహా రావు, భాస్కర్ పిన్న, రవీందర్ రావు తదితరులు హరీష్ రావుకు శాలువాలు, పూలమాలలతో సాదర స్వాగతం పలికారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో తెలంగాణ సమకాలీన రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలపై ఎన్నారైలతో హరీష్ రావు విస్తృతంగా చర్చించారు. సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలోని పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందని గుర్తు చేశారు. "నాడు వ్యవసాయ రంగానికి ఇచ్చిన ప్రాధాన్యత వల్లే, ఒకప్పుడు కరువుతో అల్లాడిన తెలంగాణ.. పదేళ్లలో దేశంలోనే అత్యధికంగా ధాన్యం పండించే పంజాబ్ రాష్ట్రాన్ని సైతం మించిపోయి రికార్డులు సృష్టించింది. సంక్షేమం, ఐటీ, మౌలిక వసతులు.. ఇలా ప్రతి రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టడం వల్లే తెలంగాణ మోడల్ దేశానికే దిక్సూచిగా మారిందన్నారు.

**విజన్ లేని రేవంత్ పాలనతో ప్రజల ఇబ్బందులు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎలాంటి విజన్ లేదని, ఆయన పాలనలో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు తెలంగాణలో స్థిరాస్తి పెట్టుబడులకు ఎగబడిన ఎన్నారైలు.. నేడు ఇక్కడి పరిస్థితులు చూసి స్వరాష్ట్రంలో కనీసం ఒక్క ప్లాట్ కొనాలన్నా తీవ్రంగా భయపడుతున్నారని వ్యాఖ్యానించారు.


**కేంద్రంలో చక్రం తిప్పేది ప్రాంతీయ పార్టీలే**

దేశ రాజకీయాలపై స్పందిస్తూ దేశంలో ప్రాంతీయ పార్టీలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని హరీష్ రావు అభిప్రాయపడ్డారు. జాతీయ పార్టీల కంటే ప్రాంతీయ పార్టీల వల్లే ఆయా రాష్ట్రాలకు ఎక్కువ న్యాయం జరుగుతుందన్నారు. ప్రస్తుతం దేశంలో ప్రాంతీయ పార్టీలే కేంద్రంలో చక్రం తిప్పుతున్నాయని, రాబోయే రోజుల్లో వాటి ప్రాధాన్యత మరింత పెరుగుతుందని ఆయన తేల్చిచెప్పారు. ఈ గ్రాండ్ మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఎన్నారై ప్రముఖులు అమర్ గుండ, పరమేశ్ బీం రెడ్డి, చైతన్న చిట్టిమల్ల, వరప్రసాద్, చందు తాళ్ల, పూర్ణ బైరి, నర్సింహా రెడ్డి, దొంతిరెడ్డి, రజినీతో పాటు పలువురు ఉత్తర అమెరికా బీఆర్ఎస్ ప్రతినిధులు, తెలంగాణ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భానుడి భగభగకు పెరిగిన విద్యుత్ వినియోగం!

**మొదటిపేజీ తరువాయి**

ఎండల తీవ్రత బాగా ఉన్నది. సూర్యప్రతాపంతో వేడిని తట్టుకోలేక చల్లదనం కోసం వినియోగదారులు ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల వాడకం పెరిగింది. దీనితో విద్యుత్ డిమాండ్, వినియోగం కూడా పెరిగింది. వినియోగం కూడా అదే స్థాయిలో పెరుగుతుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విద్యుత్ డిమాండ్ కొత్త రికార్డును సృష్టించింది. గురువారం (మే 21) రోజున గరిష్ట విద్యుత్ డిమాండ్ 4,766 మెగావాట్లకు చేరుకుంది. ఇప్పటివరకు నమోదైన గరిష్ట విద్యుత్ డిమాండ్ ఇదే. గత ఏడాది మే 6న అత్యధికంగా 4,352 మెగావాట్ల రికార్డును ఏఫ్రిల్ నెలలోనే నెలలోనే అధిగమించడం విశేషం. విద్యుత్ వినియోగం కూడా అదే స్థాయిలో పెరిగింది. గురువారం గ్రేటర్‌లో విద్యుత్ వినియోగం 100.83 మిలియన్ యూనిట్లుగా నమోదు అయింది. సాధారణంగా వేసవి తీవ్రత పెరిగే మే నెలలో విద్యుత్ వినియోగం గరిష్ట స్థాయికి చేరుతుంది. అయితే ఈసారి ఉష్ణోగ్రతలు ముందుగానే పెరగడం, వాణిజ్య, గృహ వినియోగం అధికం కావడం వల్ల ఏఫ్రిల్ నెల నుంచి నాలుగు వేల మేగావాట్లకు తగ్గకుండా విద్యుత్ డిమాండ్ నమోదు అవుతుంది. గురువారం రికార్డు స్థాయిలో 4,766 మెగావాట్లు నమోదు కావడం గమనార్హం. రికార్డు స్థాయిలో పెరుగుతున్న డిమాండ్ కు అనుగుణంగా నిరంతర సరఫరా అందించేందుకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో, 33 కేవీ/11 కేవీ ఫీడర్ల పై, సబ్ స్టేషన్ల లోని పవర్ ట్రాన్స్ ఫార్మర్ల లోడ్ ను పర్యవేక్షించాలని ఇప్పటికే క్షేత్ర స్థాయి అధికారులను, సి బ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్ వెయ్యి మెగావాట్లకు ఎక్కువగా ఉండడం గమనార్హం. విద్యుత్ వినియోగం కూడా 20 మిలియన్ యూనిట్ల పెరిగింది. సరాసరిగా 20 శాతం విద్యుత్ డిమాండ్, వినియోగం పెరగడం గమనార్హం.



# సంక్షేమం, మూసీ పునరుజ్జీవం ప్రథమ ప్రాధాన్యతలు

**మొదటిపేజీ తరువాయి**

నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా నిలిపేందుకు ప్రజా ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు దాదాపు రూ.9.43 లక్షల కోట్లకు చేరుకోవడం, అడ్వాన్సులు రూ.12.34 లక్షల కోట్లకు చేరుకోవడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రం 130.78 శాతం క్రెడిట్‌డిపాజిట్ నిష్పత్తితో ముందుకు సాగడం అద్వితీయ విషయని చెప్పారు. వ్యవసాయ రుణాల విషయంలో రూ.1,65,297 కోట్ల లక్ష్యానికి రూ.1,68,401 కోట్ల వ్యవసాయ రుణాలు పంపిణీ చేసి 101.88 శాతం సాధించడం గర్వించదగ్గ విషయంగా చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముక అని, రైతులు, పాడి రైతులు, మత్స్యకారులు, అనుబంధ రంగాలకు కిసాన్ క్రెడిట్ కార్డు సహా వివిధ పథకాల ద్వారా బ్యాంకులు అందిస్తున్న మద్దతు అభినందనీయమని అన్నారు. రాష్ట్రం పారిశ్రామిక రంగంలో అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటని డిప్యూటీ సీఎం చెప్పారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళ, దళిత, గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీపై మరింత దృష్టి పెట్టాలని కోరారు. విద్యార్థులకు ఇచ్చే రుణాల విషయంలో మరింత సానుకూల




దృక్పథంతో ముందుకు రావాలన్నారు. విద్యార్థులకు ఇచ్చే రుణాలు యువతపై మనం పెట్టే భవిష్యత్ పెట్టుబడి అని చెప్పారు. సంక్షేమంఅభివృద్ధి రెండూ జోడెద్దుల్లా పరుగులు తీయగలవని ప్రజాప్రభుత్వం చేతల్లో నిరూపించిందన్నారు. సమగ్రాభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, ఉపాధి సృష్టికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. నేడు ప్రపంచమంతా పునరుత్పాదక ఇంధన రంగంపై దృష్టి సారిస్తోందని, అందులో భాగంగా ప్రజా ప్రభుత్వం కూడా సౌరశక్తి విభాగంలో స్థిరమైన ప్రగతిని సాధిస్తోందని డిప్యూటీ సీఎం చెప్పారు. సౌరశక్తి ప్రాజెక్టులు, రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, ఇతర పర్యావరణ అనుకూల కార్యక్రమాలకు బ్యాంకులు చురుగ్గా రుణ సహాయం అందించాలని కోరారు. సామాజిక భద్రత, బీమా పథకాల పరిధిలోకి రాష్ట్ర ప్రజలను తీసుకురావాలన్నారు. బ్యాంకులు కేవలం డబ్బు డిపాజిట్ చేసే, రుణాలు ఇచ్చే ఆర్థిక సంస్థలుగానే కాక రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధిలో భాగస్వాములుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రభుత్వం 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకుందని, ప్రస్తుత వృద్ధి రేటు చూస్తుంటే ఇది ఖచ్చితంగా సాధ్యమేనని భట్టి స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశ సగటు వృద్ధి రేటు 8.2%గా ఉంటే తెలంగాణ వృద్ధి రేటు 10.7%తో దూసుకుపోతోందని చెప్పారు. దేశ సగటు తలసరి ఆదాయం రూ.2.1 లక్షలుగా ఉంటే తెలంగాణ తలసరి ఆదాయం రూ.4.18 లక్షలతో దేశంలోనే అగ్రగామిగా ఉందని ఉపముఖ్యమంత్రి గర్వంగా ప్రకటించారు. రాష్ట్రంలో వేగంగా పట్టణీకరణ జరుగుతోందని, ఈ నేపథ్యంలో సేవల రంగానికి అధిక అవకాశాలు ఉంటాయని ఆయన చెప్పారు.

**వడ్డీ లేని రుణాలు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు**

మహిళా ఆర్థిక సాధికారత కోసం స్వయం సహాయక సంఘాల వడ్డీ లేని రుణాలు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఈ ఏడాది హైదరాబాద్ నగరంలో మహిళా సంఘాలకు రుణ పంపిణీపై యుద్ధప్రాతిపదికన దృష్టి సారించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వ్యాపార, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగాల్లో ఎదగడానికి మహిళలకు నగరం ఎన్నో అవకాశాలను ఇస్తోందని చెప్పారు. నగరంలోని మురికివాడల్లోని యువ మహిళా పారిశ్రామికవేత్తలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో త్వరలోనే అనేక ఇండస్ట్రియల్ హబ్‌లు, క్లస్టర్లను తీసుకు వస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఫార్మా, ఫ్యాబ్ సిటీ, స్టీల్, లెదర్, టెక్స్‌టైల్ వంటి వివిధ రంగాలను డిజైన్ చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ దాన కిషోర్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఫైనాన్స్‌ప్లానింగ్ సెక్రెటరీ గౌరవ్ ఉప్పల్, ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ చిన్మయ మోహన్, ఎస్బీఐ సీజీఎం నీలేష్ ద్వివేది తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో హైడ్రా మెరుపు దాడులు

**హైదరాబాద్, మే 22:**

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు, భూ ఆక్రమణలపై హైడ్రా అధికారులు దూకుడు కొనసాగిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై శుక్రవారం మెరుపు దాడులు నిర్వహించారు. ఎయిర్‌పోర్ట్ కాలనీ పరిసరాల్లో ఔటర్ రింగ్ రోడ్డు పక్కన ఉన్న సుమారు ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలను బుల్డోజర్లతో కూల్చివేశారు. ఈ భూమిని కొంతమంది ఆక్రమణదారులు ఎలాంటి అనుమతులు లేకుండా స్వాధీనం చేసుకుని పక్కా నిర్మాణాలు చేపట్టినట్లు అధికారులు గుర్తించారు.

సమాచారం అందుకున్న హైడ్రా బృందాలు భారీ యంత్రాలతో అక్కడికి చేరుకుని కూల్చివేతలు చేపట్టాయి. ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ముందస్తుగా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసుల పహారా మధ్య అక్రమ నిర్మాణాలను పూర్తిగా నేలమట్టం చేసి ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నారు.

హైదరాబాద్ నగరం, శివారు ప్రాంతాల్లో చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి రక్షించడమే లక్ష్యంగా హైడ్రా నిరంతరం దాడులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎంతటి రాజకీయ పలుకుబడి ఉన్నవారైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మరోసారి స్పష్టం చేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో జరిగిన ఈ కూల్చివేతలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.



## విద్యా కమిషన్ చైర్మన్ పదవికి ఆకునూరి మురళి రాజీనామా

- **సీఎస్‌కు లేఖ పంపిన విశ్రాంత ఐఏఎస్ అధికారి**
- **బాధ్యతలను విజయవంతంగా పూర్తి చేశానన్న ఆకునూరి మురళి**

**హైదరాబాద్, మే 22:**

తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ పదవికి విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపించారు. తనకు అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా పూర్తి చేసినందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆకునూరి మురళి లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ విద్యా కమిషన్ చైర్‌పర్సన్‌గా సేవలందించే అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ బలోపేతం, సంస్కరణలపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి సిఫార్సులతో కూడిన సమగ్ర నివేదికను ఇప్పటికే ప్రభుత్వానికి సమర్పించినట్లు వెల్లడించారు.

"మాకు అప్పగించిన పనిని విజయవంతంగా పూర్తి చేశాం. విద్యా రంగంపై నివేదికను ప్రభుత్వానికి అందించాం. నా బాధ్యత నెరవేరినందున తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ పదవికి రాజీనామా సమర్పిస్తున్నాను" అని ఆకునూరి మురళి తన లేఖలో వివరించారు.

విద్యా రంగంలో కీలక మార్పుల కోసం కమిషన్ విస్తృతంగా అధ్యయనం చేసి నివేదిక సిద్ధం చేసినట్లు సమాచారం. టాస్క్ పూర్తవడంతోనే ఆకునూరి మురళి పదవి నుంచి తప్పుకోవడం రాష్ట్ర రాజకీయ, విద్యా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# భద్రాద్రిలో 385 కేజీల గంజాయి పట్టివేత

- **వాహన తనిఖీల్లో భారీగా గంజాయి స్వాధీనం**
- **రెండు కార్లు, ఒక లారీ సీజ్ చేసిన పోలీసులు**
- **ఆరుగురు నిందితుల అరెస్ట్**

**భద్రాద్రి కొత్తగూడెం, మే 22**

గంజాయి అక్రమ రవాణాపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లాలో నిర్వహించిన ప్రత్యేక వాహన తనిఖీల్లో భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 385 కిలోల గంజాయిని పట్టుకుని అక్రమ రవాణాకు ఉపయోగించిన రెండు కార్లు, ఒక లారీని పోలీసులు సీజ్ చేశారు. ఈ కేసులో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అక్రమంగా గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. అనుమానాస్పద వాహనాలను ఆపి తనిఖీ చేయగా భారీగా గంజాయి బయటపడినట్లు పేర్కొన్నారు. గంజాయి రవాణా వెనుక ఉన్న ముఠాలపై కూడా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. జిల్లాను కేంద్రంగా చేసుకుని ఇతర ప్రాంతాలకు మత్తు పదార్థాలు తరలిస్తున్న నెట్వర్క్‌పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంలో మరికొందరి ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్నామని వెల్లడించారు. అక్రమ మత్తు పదార్థాల నియంత్రణకు జిల్లా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాహన తనిఖీలను జిల్లావ్యాప్తంగా మరింత విస్తరించనున్నట్లు పోలీసులు తెలిపారు. సరిహద్దు ప్రాంతాలు, ప్రధాన రహదారులపై నిరంతర నిఘా కొనసాగుతోందన్నారు. అనుమానాస్పద కదలికలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో అవసరమని జిల్లా పోలీసులు పేర్కొన్నారు. గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు పని చేస్తున్నాయని తెలిపారు. నేరాలకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు.






# బీఆర్ఎస్‌లో సభ్యత్వ కలకలం

**మొదటిపేజీ తరువాయి**

ఇవ్వడం పార్టీలో చర్చనీయాంశమైంది.

సభ్యత్వ నమోదు కోసం మాత్రమే ఈ నియామకాలు జరిగాయా..? లేక భవిష్యత్తు రాజకీయ వ్యూహంలో భాగమా..? అన్న సందేహాలు నేతల్లో వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా సభ్యత్వ ఇన్చార్జ్‌లుగా నియమితులైన పలువురు నేతలు ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే టిక్కెట్ ఆశిస్తున్నవారే కావడంతో స్థానిక నాయకత్వంలో టెన్షన్ పెరిగినట్లు సమాచారం.

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు సభ్యత్వ బాధ్యతలు అప్పగించడంతో ఆయన వచ్చే ఎన్నికల్లో అక్కడి నుంచి పోటీ చేసే అవకాశాలపై ప్రచారం మొదలైంది. ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, పాలేరులో ఎమ్మెల్సీ తాతా మధుకు బాధ్యతలు ఇవ్వడంపైనా ఇదే తరహా చర్చ




జరుగుతోంది. ఖైరతాబాద్‌లో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, కంటోన్మెంట్‌లో క్రిశాంక్, జూబ్లీహిల్స్‌లో విష్ణువర్ధన్ రెడ్డికి సభ్యత్వ నమోదు బాధ్యతలు అప్పగించడం కూడా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. వీరంతా భవిష్యత్తులో ఎమ్మెల్యే టిక్కెట్ ఆశిస్తున్న నేతలుగా ప్రచారం ఉండటంతో స్థానిక ఇన్చార్జ్‌ల్లో అనుమానాలు పెరుగుతున్నాయి.

మేడ్చల్ నియోజకవర్గంలో రాగిడి లక్ష్మారెడ్డికి బాధ్యతలు ఇవ్వడం, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో స్థానిక రాజకీయాలతో సంబంధం ఉన్న నేతలను ఎంపిక చేయడం కూడా చర్చకు దారితీసింది. ఇతర నియోజకవర్గాల్లో లేని విధంగా కొన్ని చోట్ల ప్రత్యేకంగా టిక్కెట్ ఆశావహులకే బాధ్యతలు ఇవ్వడంపై నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

వచ్చే ఎన్నికల నాటికి ఆయా నియోజకవర్గాల్లో కొత్త నాయకత్వాన్ని బలోపేతం చేయాలనే వ్యూహంతోనే కేసీఆర్ ఈ నియామకాలు చేసి ఉండొచ్చన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభం కాకముందే బీఆర్ఎస్‌లో అంతర్గత రాజకీయ సమీకరణాలు వేడెక్కడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



# వ్యవసాయం ఈజీ.. ధాన్యం అమ్మడం కష్టం

## కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతల ఆవేదన

### లారీలు, గన్నీ సంచుల కొరతతో నిలిచిపోతున్న ధాన్యం

### అకాల వర్షాలతో రైతుల గుండెల్లో గుబులు

### పాలకుల నిర్లక్ష్యంపై పెరుగుతున్న ఆగ్రహం

**తెలుగు రాష్ట్రాల్లో మరోసారి రైతాంగం కష్టకాలాన్ని ఎదుర్కొంటోంది. పంట పండించడం వరకే రైతు బాధ్యత అన్నట్టుగా ప్రభుత్వాల వ్యవహారం కనిపిస్తోంది. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని అమ్ముకునే దశలో రైతులు పడుతున్న ఇబ్బందులు చూస్తే వ్యవసాయం నిజంగా ఈజీనా..? లేక ధాన్యం అమ్ముకోవడమే పెద్ద యుద్ధమా..? అనే ప్రశ్న తలెత్తుతోంది. కొనుగోలు కేంద్రాల్లో రైతుల దుస్థితి రోజురోజుకీ దారుణంగా మారుతోంది. టీవీల్లో రైతుల గోసలు కనిపిస్తున్నా, పత్రికల్లో కథనాలు వెలువడుతున్నా పాలకుల్లో మాత్రం చలనం కనిపించడం లేదు.**

రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం రాశులు పేరుకుపోతున్నాయి. కాంటా వేయడానికి రోజులు పడుతోంది. కాంటా వేసిన ధాన్యం కూడా లారీల్లో ఎక్కడం లేదు. దీంతో రైతులే తమ ధాన్యానికి కాపలాదారులుగా మారుతున్నారు. రాత్రింబవళ్లు కేంద్రాల వద్దే మగ్గాల్సి వస్తోంది. వర్షాకాలం దగ్గరపడటంతో రైతుల ఆందోళన మరింత పెరిగింది. అకాల వర్షాలతో ఇప్పటికే పలుచోట్ల ధాన్యం తడిసి నష్టపోయింది. ఇంకా కేంద్రాల వద్ద పేరుకుపోయిన వడ్లు ఎప్పుడు తడుస్తాయోనన్న భయం రైతులను వెంటాడుతోంది.

ధాన్యం కొనుగోలు వ్యవస్థలో ప్రణాళికా లోపాలు బహిర్గతమవుతున్నాయి. లారీలు లేవు, గన్నీ సంచులు లేవు, హమాలీలు అందుబాటులో లేరు అనే కారణాలతో కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేక రైతులు ఎండలో, వానలో అవస్థలు పడుతున్నారు. ఉదయం రోడ్డుపై ధాన్యం ఆరబెట్టి, సాయంత్రం టార్పాలిన్లు కప్పి కాపలా కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంటను పండించిన రైతు చివరికి రోడ్డు మీదే జీవించాల్సిన పరిస్థితి రావడం విచారకరం.

తాలు, తడిసిందన్న పేర్లతో కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. రైస్ మిల్లర్లు నాలుగైదు కిలోల వరకు తరుగు పేరిట కోతలు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. మరోవైపు లారీ యజమానులు సంచికి అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పీఏసీఎస్ కేంద్రాల్లో కూడా అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతు కష్టానికి సరైన గౌరవం దక్కాల్సిన చోట దోపిడీకి గురవుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

ఈ సమస్య కొత్తది కాదు. ఎవరు అధికారంలో ఉన్నా రైతుల బాధలు మాత్రం మారడం లేదు. గత ప్రభుత్వాల హయాంలోనూ ఇలాంటి దృశ్యాలే కనిపించాయి. అప్పట్లో రైతుల పక్షాన మాట్లాడిన నాయకులు ఇప్పుడు అధికారంలో ఉన్నా పరిస్థితి ఎందుకు మారలేదన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రతిపక్షాలు కూడా కేవలం విమర్శలకే పరిమితమవుతున్నాయి తప్ప రైతుల సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పోరాడుతున్న దాఖలాలు కనిపించడం లేదు. రైతు దేశానికి వెన్నెముక అని ప్రతి సభలో చెప్పే నాయకులు, అదే రైతు కొనుగోలు కేంద్రాల వద్ద పడుతున్న కష్టాలను ఎందుకు చూడటం లేదు? పంట పండించే వరకు రైతు అవసరం.. ఆ తర్వాత అతని బాధలు ఎవరికీ పట్టవా? అనే ఆవేదన అన్నదాతల్లో వ్యక్తమవుతోంది. రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా అధికార యంత్రాంగం స్పందన మాత్రం నిర్లక్ష్యంగానే కనిపిస్తోంది. ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం ఉన్నతస్థాయి సమీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఫలితం కనిపించడం లేదు. జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగా కేంద్రాలను సందర్శించి సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉంది. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. లారీలు, గన్నీ సంచులు, హమాలీల కొరతను వెంటనే నివారించాలి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రెండు రోజుల్లోనే తరలించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

**రైతు కష్టానికి విలువ ఇవ్వని వ్యవస్థ ఎప్పటికీ బలంగా నిలవదు. పంట పండించే రైతు నిలబడితేనే దేశ ఆర్థిక వ్యవస్థ నిలబడుతుంది. రైతును ఓటు బ్యాంకుగా కాకుండా దేశ భవిష్యత్తుగా చూడాల్సిన సమయం ఇది. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి రైతుల కష్టాలకు ముగింపు పలకాలి.**

# రిజర్వేషన్ల ఫలాలు అందరికీ అందేదెప్పుడు?

- ఒకే కుటుంబం పదేపదే కోటా అనుభవిస్తే ఎలా?
- ఐఏఎస్ పిల్లలకూ రిజర్వేషన్లు అవసరమా?
- క్రీమీలేయర్ మినహాయింపులపై సుప్రీంకోర్టు
- కేంద్ర ప్రభుత్వానికి న్యాయస్థానం నోటీసులు




**న్యూఢిల్లీ, మే 22:** రిజర్వేషన్ల వ్యవస్థపై సుప్రీంకోర్టు చేసిన తాజా వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. రిజర్వేషన్ల ఫలాలు పదేపదే ఒకే కుటుంబాలకు పరిమితం కావడం వల్ల నిజంగా వెనుకబడిన వర్గాలకు అవకాశాలు అందకుండా పోతున్నాయని అత్యున్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా ఇప్పటికే ఉన్నత స్థాయికి చేరుకున్న కుటుంబాలు కూడా తరతరాలుగా అదే రిజర్వేషన్ కోటాను వినియోగించుకోవడాన్ని ధర్మాసనం తీవ్రంగా ప్రశ్నించింది. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమీ లేయర్' పరిమితులు, రిజర్వేషన్ మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారిస్తున్న సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ నాగరత్న మాట్లాడుతూ.. "రిజర్వేషన్ల ద్వారా ఒక కుటుంబం ఇప్పటికే ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, వారి పిల్లలకు మళ్లీ అదే కోటా ఎందుకు అవసరం?" అని ప్రశ్నించారు. "తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులు అయి, ప్రభుత్వ అత్యున్నత సేవల్లో స్థిరపడి ఉన్నప్పుడు, వారి పిల్లలను కూడా వెనుకబడిన వర్గంగా ఎలా పరిగణించాలి?" అని ధర్మాసనం ప్రశ్నించింది. ఒకే కుటుంబం తరతరాలుగా రిజర్వేషన్ల ప్రయోజనాలను అనుభవిస్తే, అదే వర్గంలోని అత్యంత పేద, అణగారిన వర్గాలకు అన్యాయం జరుగుతుందని కోర్టు అభిప్రాయపడింది. రిజర్వేషన్ల అసలు ఉద్దేశం సమాజంలో వెనుకబడిన వర్గాలకు అవకాశాలు కల్పించడమే గానీ, కొందరు కుటుంబాలకు శాశ్వత హక్కుగా మారడం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. "ఇలా కొనసాగితే దేశం ఎప్పటికీ రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి బయటపడలేదు" అని వ్యాఖ్యానించడం ప్రాధాన్యత సంతరించుకుంది. దేశంలో ప్రస్తుతం ఓబీసీలకు అమలవుతున్న 'క్రీమీ లేయర్' నిబంధనలను మరింత కఠినంగా, శాస్త్రీయంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని ధర్మాసనం సూచించింది. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ.8 లక్షలు దాటిన కుటుంబాలు, అలాగే ఐఏఎస్, ఐపీఎస్, ఉన్నత సైనికాధికారులు, రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారి పిల్లలను క్రీమీ లేయర్ కింద పరిగణిస్తూ రిజర్వేషన్ల నుంచి మినహాయిస్తున్నారు. అయితే ఈ నిబంధనలను సవాల్ చేస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి, ఇతర సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వాయిదా వేసింది. ఇప్పటికే మాజీ సీజేఐ బీఆర్ గవాయ్ కూడా ఇలాంటి అభిప్రాయాలనే వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల ప్రయోజనాలు నిజంగా అట్టడుగు వర్గాలకు చేరుతున్నాయా? లేక ఒకే వర్గంలోని కొందరికే పరిమితమవుతున్నాయా? అన్న అంశంపై దేశవ్యాప్తంగా మళ్లీ చర్చ మొదలైంది. రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్యలు భవిష్యత్తులో విధానపరమైన మార్పులకు దారితీసే అవకాశముందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# నీట్ పేపర్ లీకేజీలో దర్యాప్తు ముమ్మరం

## లాతూర్‌కు చెందిన డాక్టర్ అరెస్ట్



**ముంబయి, మే 22:** లీకైన నీట్ గెస్ పేపర్‌ను కొనుగోలు చేసిన ఒక డాక్టర్‌ను సీబీఐ అదుపులోకి తీసుకున్నది. ఆయన ఆసుపత్రిలో ప్రత్యేక క్లాసులు నిర్వహించి నీట్ గెస్ పేపర్ లీక్ చేయడంపై ప్రశ్నిస్తున్నది. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన పీడియాట్రిషియన్ డాక్టర్ మనోజ్ శిరూరేకు ఇప్పటికే అరెస్టయిన ఎన్టీఏ కమిటీలో సభ్యుడైన పూణెలికు చెందిన ప్రొఫెసర్ పీవీ కులకర్ణి, ఆర్‌సీసీ క్లాసెస్ డైరెక్టర్ శివరాజ్ మోటెగావ్‌కర్‌తో పరిచయం ఉన్నది. ఈ నేపథ్యంలో తన మేనల్లుడు, మేనకోడలు కోసం నీట్ గెస్ పేపర్‌ను ఆయన కొనుగోలు చేసినట్లు సీబీఐ దర్యాప్తులో తేలింది. దీంతో గురువారం లాతూర్‌లో డాక్టర్ మనోజ్‌ను సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పూణెలిలోని తమ కార్యాలయానికి తరలించి ప్రశ్నిస్తున్నారు. ఆ తర్వాత ఢిల్లీకి తీసుకెళ్లి ఆయన అరెస్ట్‌ను ప్రకటించనున్నారు. కాగా, నీట్ పరీక్షకు కొన్ని రోజుల ముందు డాక్టర్ మనోజ్‌కు చెందిన లాతూర్‌లోని ఆసుపత్రిలో పీవీ కులకర్ణి ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు సీబీఐ తెలిపింది. ఆర్‌సీసీ క్లాసెస్ డైరెక్టర్ శివరాజ్ కుమారుడు కూడా ఈ క్లాస్‌లకు హాజరైనట్లు పేర్కొంది. ఈ ఆసుపత్రిలోనే నీట్ గెస్ పేర్ లీకైనట్లు సీబీఐ నిర్ధారించింది. ఈ నేపథ్యంలో శివరాజ్ కుమారుడు, డాక్టర్ మనోజ్ మేనకోడలు, మేనల్లుడిని కూడా సీబీఐ అధికారులు విడివిడిగా ప్రశ్నించారు. మరోవైపు నీట్ పరీక్షకు ముందు కుమార్తె కోసం లీకైన ప్రశ్నాపత్రాన్ని రూ. 5 లక్షలకు కొనుగోలు చేసినట్లు భావురావు కదమ్‌పై ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో నాందేడ్‌లోని ఆ నివాసంపై సీబీఐ రైడ్ చేసింది. సుమారు ఎనిమిది గంటల పాటు జరిగిన సోదాల్లో కీలక పత్రాలను సీబీఐ అధికారులు పరిశీలించారు. భావురావు కుటుంబ సభ్యులను కూడా ప్రశ్నించారు. తదుపరి విచారణ కోసం పుణెలోని తమ కార్యాలయానికి రావాలని భావురావు, ఆయన కుటుంబ సభ్యులను సీబీఐ ఆదేశించింది. అయితే మే 3న నీట్ ఎగ్జామ్‌ను నిర్వహించగా పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 12న ఆ పరీక్షను ఎన్టీఏ రద్దు చేసింది. ఈ నేపథ్యంలో నీట్ పేపర్ లీక్‌లో పూణె, లాతూర్, నాందేడ్ వ్యక్తుల మధ్య సంబంధాలను సీబీఐ పరిశీలిస్తున్నది. నీట్ లీక్ పేపర్‌ను ఎంత మంది తల్లిదండ్రులు , ఎంతెంతకు కొనుగోలు చేశారు అన్నది దర్యాప్తు చేస్తున్నది.

# ఎవరెస్ట్‌పై విషాదం

## కిందకు వస్తుండగా ఇద్దరు భారతీయుల మృతి

**న్యూఢిల్లీ:** ఎవరెస్ట్ పర్వత శిఖరంపై విషాదం చోటుసేసుకుంది. పర్వతారోహణ ముగించుకుని కిందకు దిగివస్తుండగా ఇద్దరు భారతీయులు ప్రాణాలు కోల్పోయినట్టు నేపాల్ అధికారులు ప్రకటించారు. మృతులను అరుణ్‌కుమార్ తివారీ, సందీప్ అరేగా గుర్తించారు. ఎవరెస్ట్ శిఖరం దిగుతుండగా సందీప్ అరే తీవ్రంగా అలసిపోయారని, ఆయనను కాపాడేందుకు గైడ్స్ ప్రయత్నించినప్పటికీ ప్రాణాలను కాపాడలేకపోయారని ఎక్స్‌పెడిషన్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ నేపాల్ సెక్రటరీ జనరల్ రిషి భండారి తెలిపారు. గురువారం సాయంత్రం 5.30 గంటల సమయంలోనే మరో పర్యతారోకుడు అరుణ్ తివారీ కూడా ఎవరెస్ట్ నుంచి కిందకు దిగుతూ హిల్లరీ స్టెప్ వద్ద తీవ్రంగా అలసిపోవడంతో నలుగురు గైడ్స్ ఆయనకు సాయం చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని చెప్పారు. క్యాంప్-2 వద్ద ఆయన కన్నుమూసినట్టు వివరించారు. ఎవరెస్ట్ శిఖరాన్ని గత బుధవారంనాడు విజయవంతంగా 274 మంది అధిరోహించారు. ఒకోరోజు అత్యధిక సంఖ్యలో ఎవరెస్ట్ అధిరోహించిన బృందంగా కూడా వీరు రికార్డు నెలకొల్పారు. ఇందులో సందీప్ అరే కూడా అన్నారు. అయితే పర్వతం నుంచి కిందకు దిగుతుండగా సందీప్ అరే మృతిచెందగా, గురవారంనాడు మరో బృందం ఎవరెస్ట్ శిఖరం చేరుకుంది. అందులో అరుణ్ తివారీ ఉన్నారు. పర్వతం దిగివస్తుండగా ఆయన మృతి చెందారు.

# సీజేపీ అధికారిక ఎక్స్ ఖాతా నిలిపివేత

## కాక్రోచ్ జనతా పార్టీ విదేశీ శక్తుల కుట్ర? : దర్యాప్తు చేస్తున్న ఇంటెలిజెన్స్ వర్గాలు





**ఢిల్లీ:** సోషల్ మీడియాను షేక్ చేస్తున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) విదేశీ శక్తుల కుట్రంటూ భారత భద్రతా సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దేశంలో నిరుద్యోగ యువత అసంతృప్తిని ఆసరాగా చేసుకుని అశాంతిని సృష్టించేందుకు వ్యూహం పన్నారనే కోణంలో ఇంటెలిజెన్స్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. సోషల్ మీడియాలో అతి తక్కువ సమయంలో మిలియన్ల కొద్దీ ఫాలోవర్స్ రావడంపైనా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీని వెనుక విదేశీ శక్తుల ప్రమేయం ఉందేమోనని భావిస్తూ ఆరా తీస్తున్నారు. న్యాయవ్యవస్థపై ఆర్టీఐ యాక్టివిస్టుల తీరును తప్పుబడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. వారిని బొద్దింకలతో పోల్చుతూ సీజేఐ ఘాటుగా స్పందించారు. సీజేఐ సూర్యకాంత్ తీరుకు నిరసనగా సోషల్ మీడియాలో కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో వ్యంగ్యాత్మక ఉద్యమం పుట్టుకొచ్చింది. కేవలం 5 రోజుల్లోనే సీజేపీ ఇన్‌స్టాగ్రామ్ పేజీని 1.5 కోట్ల ఫాలోవర్సు దాటేశారు. అధికార బీజేపీ ఫాలోయింగ్‌నీ సీజేపీ దాటేయడం చర్చనీయాంశమైంది. నిరుద్యోగం, నీట్ పేపర్ లీకేజీలు, ఆర్థిక ఇబ్బందులపై జెన్-జీ యువత డిజిటల్ ప్లాట్ ఫామ్స్ వేదికగా ఉద్యమానికి దిగారు. అయితే, ఒకే తరహా హ్యాష్‌ట్యాగ్‌లు, ఏఐ సాంగ్స్, సింక్రనైజ్డ్ పోస్టుల వెనుక డీప్ స్టేట్ ఐటీ సెల్స్ హస్తం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ మేరకు భద్రతా కారణాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో భారతదేశంలో సీజేపీ అధికారిక ఎక్స్ ఖాతాను నిలిపివేశారు. అయితే, యువత వ్యంగ్య నిరసనను అణచివేయడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అందుకే 'దేశ వ్యతిరేక' ముద్ర వేస్తూ అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని ప్రతిపక్ష నేతలు, విమర్శకులు మండిపడుతున్నారు.

# కేంద్రానికి ఆర్‌బీఐ శుభవార్త

## రూ.2.87 లక్షల కోట్లు డివిడెండ్ ప్రకటన

**ముంబయి, మే 22:** కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుడ్‌న్యూస్ చెప్పింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.2.87 లక్షల కోట్లు డివిడెండ్ రూపంలో చెల్లించనున్నట్లు శుక్రవారం ప్రకటించింది. ఆర్‌బీఐ ఏటా మిగులు నిధులను కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో చెల్లిస్తుంది. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చిత పరిస్థితుల్లో ప్రభుత్వానికి ఈ మొత్తం ఊరట కల్పించే అంశం. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు డైరెక్టర్లు నిర్వహించిన 623వ సమావేశంలో డివిడెండ్ చెల్లింపులపై నిర్ణయం తీసుకున్నారు. ఈ స్థాయిలో డివిడెండ్ చెల్లించడం ఇదే తొలిసారి. దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, భయాందోళనల ముప్పును సమీక్షించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్‌బీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. దేశ, విదేశీ సెక్యూరిటీలపై వడ్డీ, సేవలపై రుసుములు, కమిషన్లు, విదేశీ మారకపు ద్రవ్యం లావాదేవీలపై లాభం, అనుబంధ సంస్థల నుంచి ప్రతిఫలం రూపేణ ఆర్‌బీఐకు ఆదాయం లభిస్తుంది. కరెన్సీ నోట్ల ముద్రణ, డిపాజిట్లు-రుణాలపై వడ్డీల చెల్లింపులు, సిబ్బంది జీతభత్యాలు-పింఛన్లు, కార్యాలయాల నిర్వహణ ఖర్చులు, ఆకస్మిక పరిస్థితులు- తరుగుదలకు కేటాయింపులు వంటి వ్యయాలు ఉంటాయి. ఈ ఆదాయ, వ్యయాల మధ్య తేడానే మిగులు నిధులుగా వ్యవహరిస్తారు. ఈ మిగులు నిధులను కేంద్రానికి ఏటా బదిలీ చేస్తుంది. ఆర్‌బీఐ, ప్రభుత్వ రంగ బ్యాంకుల డివిడెండ్ల రూపంలో ఖజానాకు రూ.3.16 లక్షల కోట్లు సమకూరుతాయని బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసింది.



# ఇన్సూరెన్స్ డబ్బుల కోసం భార్యను హత్య చేశాడా?

**గోల్ తండాలో దారుణం.. ఉరేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని బంధువుల ఆరోపణ**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** తిరుమలాయపాలెం మండలం గోల్ తండాలో దారుణ ఘటన వెలుగుచూసింది. ఇన్సూరెన్స్ డబ్బుల కోసం భర్తే తన భార్యను కొట్టి చంపి ఉరేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. గోల్ తండాకు చెందిన బానోత్ శివాజీ, మీనాక్షి దంపతులు 12 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొంతకాలంగా దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. గురువారం రాత్రి మరోసారి ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఆ సమయంలో శివాజీ మీనాక్షిని తీవ్రంగా కొట్టి, అనంతరం చున్నీతో ఉరివేసి చంపి దాన్ని ఆత్మహత్యగా చూపించే ప్రయత్నం చేశాడని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.సమాచారం అందుకున్న తిరుమలాయపాలెం ఎస్ఐ కూచిపూడి జగదీష్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మీనాక్షి ఒంటిపై గాయాల ఆనవాళ్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం పూర్తి వివరాలు వెల్లడవుతాయన్నారు.

**ఇన్సూరెన్స్ కోణంలో ఆరోపణలు:**
స్థానికుల కథనం ప్రకారం, ఇంటిపై రూ.80 లక్షల లోన్ ఉంది. మృతురాలి పేరు మీద రూ.కోటి ఇన్సూరెన్స్ ఉన్నట్లు చెబుతున్నారు. ఇన్సూరెన్స్ క్లెయిమ్ కోసమే భార్యను హత్య చేశాడని బంధువులు ఆరోపిస్తున్నారు. గతంలో భార్యను కింద పడేసి పిడిగుద్దులతో హింసించిన దృశ్యాలు కూడా ఉన్నాయని, భర్త శాడిజం ప్రదర్శించేవాడని వారు చెబుతున్నారు.

**భర్త పోలీస్ స్టేషన్‌లో లొంగుబాటు?**
14 సంవత్సరాల క్రితం పెళ్లి చేసుకుని ఇద్దరు బాబులతో పాతర్లపాడు స్టేజి దగ్గరలోని గోల్ తండాలో కాపురం ఉంటున్న దంపతుల కుటుంబంలో ఈ ఘటన జరిగింది. హత్య చేసి ఉరేసుకున్నట్లుగా చిత్రీకరించిన భర్త శివాజీ ఏమీ తెలియనట్లుగా పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం.

**బంధువుల డిమాండ్:**
ఇన్సూరెన్స్ డబ్బు కోసమే ఈ హత్య జరిగిందా లేక శివాజీ మనసులో మరి ఏదైనా దురుద్దేశం ఉందా అనే కోణంలో విచారణ జరపాలని మృతురాలి బంధువులు కోరుతున్నారు. హత్యా లేక ఆత్మహత్యా అనేది పోస్టుమార్టం రిపోర్టు వస్తేగానీ తేలదని స్థానికులు అంటున్నారు..

# జిల్లా వ్యాప్తంగా రోడ్డెక్కిన గ్రామదీపికలు.. నిరవధిక సమ్మె ప్రారంభం

**ఉద్యోగ గుర్తింపు, వేతన పెంపు డిమాండ్‌తో వివోఏ జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** తమ డిమాండ్ల సాధన కోసం ఇందిరా క్రాంతి పథకంలో పనిచేస్తున్న గ్రామదీపికలు, వివోఏలు జిల్లా వ్యాప్తంగా రోడ్డెక్కారు. రాష్ట్ర గ్రామదీపికల సమైక్య జేఏసీ, వివోఏ జేఏసీ పిలుపుమేరకు తిరుమలాయ పాలెం మండల కేంద్రంలో గురువారం నిరవధిక సమ్మె, ధర్నాను ప్రారంభించారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో గ్రామదీపికలు భారీ సంఖ్యలో నిరసన చేపట్టారు. చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని ప్రభుత్వం వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. తిరుమలా యపాలెం మండల కేంద్రంలో జరిగిన ధర్నాలో మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, గత రెండు దశాబ్దాలుగా గ్రామీణ మహిళా సంఘాల బలోపేతం, స్వయం సహాయక సంఘాల నిర్వహణ, పేద మహిళల ఆర్థికాభివృద్ధికి గ్రామదీపికలు, వివోఏలు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ ప్రభుత్వం సరైన గుర్తింపు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రధాన డిమాండ్లు:**
1. గ్రామదీపికలు, వివోఏలను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి
2. గౌరవ వేతనాలు పెంచాలి
3. ఉద్యోగ భద్రత కల్పించాలి
4. ఈఎస్ఐ, పీఎఫ్, ఆరోగ్య బీమా వంటి సంక్షేమ పథకాలు అమలు చేయాలి

ప్రస్తుతం అందుతున్న వేతనాలతో కుటుంబ పోషణ భారంగా మారిందని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీవనం సాగించడం కష్టమవుతోందని తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు, మహిళా సంఘాల పర్యవేక్షణ, బ్యాంకు లింకేజీలు, ఆర్థిక కార్యకలాపాల నిర్వహణలో నిరంతరం సేవలందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం వెంటనే చర్చలకు రావాలని, తమ డిమాండ్లపై స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసేంత వరకు నిరవధిక సమ్మెలు కొనసాగిస్తామని జేఏసీ నాయకత్వం హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో వివోఏల జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సుశీల, మండల ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ల ఉమ, పులిశెట్టి అరుణ, సామినేని కరుణ, నెట్టు స్వరూప రాణి, గంధసిరి ఇందిరా, మేకల కృష్ణవేణి, గోపోజి ఉపేంద్ర, నవిల మరియమ్మ, మండాది కళమ్మ, గుండా సువర్ణ, కామల్ల లలిత, నాయిని శ్రీలత, కొమ్ము కళ్యాణి, మహంకాళి ప్రసాద్, వాంకుడోత్ వెంకన్న, తాళ్లపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్ జిల్లావ్యాప్తంగా ముమ్మరంగా నాకాబందీ తనిఖీలు

- 109 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు
- 23 వాహనాలు సీజ్. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు పోలీసులు జిల్లావ్యాప్తంగా కట్టుదిట్ట మైన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం 7 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని ముఖ్యమైన కూడళ్లు, చౌరస్తాలు, ప్రధాన రహదారుల వద్ద ఏకకాలంలో అత్యంత అప్రమత్తంగా విస్తృతంగా నాకాబందీ నిర్వహిం చారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే శక్తులపై నిఘా ఉంచడం, రాత్రి వేళల్లో అనవసరంగా తిరిగే వారిని నియంత్రించడమే లక్ష్యంగా ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జిల్లా సరిహద్దులతో పాటు అంతర్గత రహదారు లపై పోలీసులు గట్టి నిఘా ఉంచి, అనుమానాస్పదంగా తిరుగుతున్న వాహనాలను, వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై 109 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. అలాగే సరైన పత్రాలు లేని నంబర్ ప్లేట్లు సరిగ్గా లేని నిబంధనలు ఉల్లంఘించిన 23 వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ తనిఖీలలో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తూ పాపిల్లాన్ డివైస్ ద్వారా పాత నేరస్థులు, అనుమానితుల వేలిముద్రలను సేకరించి వారి నేర చరిత్రను పరిశీలిం చారు. చట్టాన్ని, నిబంధనలను ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, భవిష్యత్తులోనూ ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# గ్రామాల్లో కనిపించని అధికారులు..

- సేవల కోసం ప్రజల పాట్లు
- నేలకొండపల్లిలో కార్యదర్శులు, ఏఎన్ఎంలు క్షేత్రస్థాయిలో అందుబాటులో లేరని ఆరోపణ

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి,ప్రభుత్వ సేవలు గ్రామీణ ప్రజలకు అందాల్సిన చోటే అధికారుల జాడ లేకపోవడంతో నేలకొండపల్లి మండలంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండల పరిధిలోని 32 గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు విధులకు సక్రమంగా హాజరుకావడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**ఫోన్ చేస్తే 'మండల్ ఆఫీస్' సమాధానం:**
స్థానికుల కథనం ప్రకారం, ఏదైనా ధ్రువపత్రం కోసమో, సమస్య పరిష్కారం కోసమో గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్తే కార్యదర్శులు అందుబాటులో ఉండటం లేదు. ఫోన్‌లో సంప్రదిస్తే "మండల్ ఆఫీస్ పనిమీద వెళ్లాను" అని చెప్పి తప్పించుకుంటున్నారని పలువురు గ్రామస్తులు తెలిపారు. నిజంగా అధికారిక పనిమీద వెళ్తున్నారా లేక వ్యక్తిగత పనులపై వెళ్తున్నారా అని తెలుసుకునే వ్యవస్థ లేకపోవడంతో ప్రజలకు సేవల్లో జాప్యం జరుగుతోంది.

**వైద్య సేవలకూ అదే పరిస్థితి:**
గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు గ్రామస్థాయిలోనే ప్రాథమిక వైద్య సేవలు అందించాల్సిన ఏఎన్ఎంలు కూడా నిర్ణీత సమయంలో అందుబాటులో ఉండటం లేదని ఆరోపణలు ఉన్నాయి. టీకాలు, ఆరోగ్య పరీక్షల కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు.

**బయోమెట్రిక్ హాజరే పరిష్కారమా?**
ఉద్యోగుల హాజరులో పారదర్శకత కోసం బయోమెట్రిక్ విధానం తీసుకురావాలని మండల ప్రముఖులు, విద్యావంతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఉదయం కార్యాలయానికి వచ్చినప్పుడు, సాయంత్రం వెళ్లేటప్పుడు బయోమెట్రిక్ హాజరు నమోదు చేస్తే విధుల పట్ల బాధ్యత పెరుగుతుందని వారి అభిప్రాయం. ఈ విధానాన్ని పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలతో పాటు క్షేత్రస్థాయి సిబ్బందికి వర్తింపజేయాలని సూచిస్తున్నారు.

**అధికారులు దృష్టి సారించాలి:**
గ్రామ పాలనను బలోపేతం చేయడానికి నియమించిన సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదని ప్రజలు అంటున్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే స్పందించి నేలకొండపల్లి మండలంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని కోరుతున్నారు. విధులకు సక్రమంగా హాజరుకాని వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు సేవలు నిరంతరాయంగా అందేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## పెద్దమ్మ తల్లికి ముక్కుపుడక బొట్టు బిళ్ళ సమర్పణ



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం ఉప్పల్వాయి గ్రామంలో పెద్దమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి మాణిక్య రజిత రాములు దంపతులు అమ్మవారికి ముక్కుపుడక, బొట్టు బిళ్ళ సమర్పించారు, వారికి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని పంతులు పూజలు చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు, పెద్దమ్మ తల్లి పండుగ సందర్భంగా సంఘ సభ్యులు ఘనంగా బోనాల ఊరేగింపు చేసి అమ్మవారికి ధూప దీప నైవేద్యాలు అర్పించారు, అలాగే భక్తులకు అన్నదానం సంఘ సభ్యులు చేశారు.

## ఆసుపత్రికి తాళం, వృద్ధురాలికి నరకయాతన!

**45 డిగ్రీల ఎండలో ద్విచక్ర వాహనంపై మోసుకొచ్చినా వైద్యం కరువు!**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** ఫోటోలో కనిపిస్తున్న ఈ వృద్ధురాలే జూపెడ గ్రామానికి చెందిన 70 ఏళ్ల అవ్వ. గురువారం మధ్యాహ్నం 45 డిగ్రీల మండే ఎండలో బీపీతో కుప్పకూలిపోయింది. కుటుంబ సభ్యులు ప్రాణాలు కాపాడుకునేందుకు ద్విచక్ర వాహనంపైనే మోసుకుంటూ సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పరుగెత్తారు. కానీ అక్కడ తలుపులకు తాళం వేసి ఉంది. డాక్టర్ లేరు, నర్సు లేరు, ఆశా వర్కర్ జాడ లేదు. ఫోన్లు స్విచ్ఛాఫ్. వైద్యం అందక నీరసించి, నొప్పితో విలవిలలాడుతూ ఇలా పడిపోయింది ఈ అవ్వ. "ప్రభుత్వ ఆసుపత్రి అంటే ఇదేనా? మా ప్రాణాలకు విలువ లేదా?" అంటూ కుటుంబ సభ్యులు రోదించారు. అదే సమయంలో వైద్య సిబ్బంది మాత్రం "ఫీల్డ్ విజిట్‌కు వెళ్లాం" అని అబద్ధం చెప్పి జూపెడ–పైనంపల్లి మధ్యలోని మామిడి తోటలో బర్త్‌డే పార్టీ చేసుకుంటూ జల్సాలు చేస్తున్నారు. ఇక్కడ వృద్ధురాలు చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతుంటే, అక్కడ పరదాలు కట్టుకుని కేక్‌లు కోసుకుంటూ విందులు చేసుకుంటున్నారు. అంతేకాదు... ఇదే దారుణం! తన నాయనమ్మను కాపాడేందుకు ఆసుపత్రికి వచ్చిన మనవడు, "వైద్యం మానేసి ఇక్కడ జల్సాలు చేస్తున్నారేమిటి?" అని నిలదీసి, ఆధారాల కోసం వీడియో తీశాడు. దాంతో రెచ్చిపోయిన వైద్య సిబ్బంది అతనిపైనే ఉల్టా ఫిర్యాదు చేశారు. "మేము టాయిలెట్‌కు వెళ్తుంటే వీడియో తీశాడు" అని సిగ్గులేకుండా అబద్ధపు పిటిషన్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో నాపై పిర్యాదు చేశారని మహేష్ విలేకరులతో తన గోడును విన్నవించుకున్నాడు. తప్పు చేసి దొరికిపోయినా పశ్చాత్తాపం లేదు. పైగా బాధితుడిపైనే నిందలు వేసి కేసులు పెట్టించేందుకు కుట్ర! వృద్ధులను, పేదలను పట్టించుకోకుండా పనివేళల్లో జల్సాలు చేయడం ఒక నేరమైతే, ప్రశ్నించిన వారిపై అబద్ధపు కేసులు బనాయించడం మరో మహా నేరం. ఇది నిర్లక్ష్యం కాదు... నరహత్యతో సమానం. ఇది వ్యవస్థకే సిగ్గుచేటు. తక్షణమే విధులకు గైర్హాజరైన సిబ్బందిని సస్పెండ్ చేసి, తప్పుడు ఫిర్యాదు చేసినందుకు క్రిమినల్ కేసులు పెట్టాలి. ఈ అవ్వలాంటి పేదలకు న్యాయం జరిగే వరకు ప్రజలు ఊరుకునేది లేదు.

## గొట్టిముక్కుల గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ మండల పరిధిలోని గొట్టిముక్కల గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రైతులకు సమతుల్య ఎరువుల వినియోగం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అధిక మోతాదులో యూరియా, రసాయన ఎరువుల వినియోగం వల్ల నేల సారత తగ్గిపోవచ్చని, యూరియా వినియోగాన్ని తగ్గించి సమతుల్య ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. నేల పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించడం ద్వారా ఖర్చులు తగ్గి దిగుబడులు మెరుగుపడతాయని వివరించారు. వ్యవసాయంలో నీటి వినియోగాన్ని తగ్గించే పద్ధతులపై రైతులకు సూచనలు అందించారు. తక్కువ నీటితో సాగు చేసే పద్ధతులు అవలంబించడం, పంటలకు అవసరమైన మేరకే నీరు అందించడం ద్వారా నీటి సంరక్షణతో పాటు అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. పంటల వైవిధ్యీకరణ ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని వివరించారు. వరి, మొక్కజొన్న పంటలలో మంచి దిగుబడులు ఇచ్చే హైబ్రిడ్ విత్తనాల ఎంపిక, సాగు పద్ధతులు, పంట సంరక్షణపై శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో రైతులకు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, సమగ్ర పోషక నిర్వహణ, పంటల మార్పిడి, ఇతర వ్యవసాయ సంబంధిత అంశాలపై కూడా అవగాహన కల్పించబడింది. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డి. పద్మజ, కె. వాణిశ్రీ, గ్రామ సర్పంచ్ సంగీత, మండల వ్యవసాయ అధికారి జి. ప్రసన్న లక్ష్మి , వ్యవసాయ విస్తరణ అధికారి అయ్యప్ప పాల్గొన్నారు. గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సర్కార్ గోల్డెన్ మండీని ప్రారంభించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్



**కాప్రా, రాజముద్ర న్యూస్:** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్‌లోనీ జీఆర్ రెడ్డి నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన సర్కార్ గోల్డెన్ మండి ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ఘనంగా సర్కార్ గోల్డెన్ మండి ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. స్వయం ఉపాధిలో భాగంగా సర్కార్ గోల్డెన్ మందిని ఏర్పాటు చేసిన నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపార రంగంలో యువత ముందుకు వచ్చి స్వయం శక్తితో సమాజంలో అభివృద్ధి చెందాలని ఆయన అన్నారు. స్థానిక వ్యాపారాభివృద్ధికి, ఉపాధి అవకాశాల పెంపుకు ఈ సంస్థ దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం అన్లోడింగ్ పక్రియను వేగవంతం చేయాలి



**రాజముద్ర న్యూస్, తాండూర్:** వరి ధాన్యం అన్లోడింగ్ పక్రియను వేగవంతం చేయాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ సూచించారు. శుక్రవారం తాండూర్ మండల కేంద్రంలోని కార్తికేయ రైస్ మిల్లును తాండూర్ తహశీల్దార్ యు. జ్యోత్స్న తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కనీసం మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుంచి నిబంధనల ప్రకారం నాణ్యమైన వరి ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. వరి కొనుగోలు కేంద్రాల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని పేర్కొన్నారు. గోదాములకు తరలించిన వరి ధాన్యాన్ని నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని, తదుపరి ఆదేశాల ప్రకారం తరలించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ బి.పద్మజా,రెవిన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# వడదెబ్బతో ఎస్టీ హాస్టల్ ఉద్యోగిని మృతి

**రాజముద్ర న్యూస్, నేరడిగొండ:** తీవ్ర ఎండల ప్రభావంతో వడదెబ్బకు గురై ఉట్నూర్లోని ఎస్టీ హాస్టల్ ఉద్యోగిని మృతి చెందిన ఘటన నేరడిగొండ మండలంలో విషాదాన్ని నింపింది. బోరిగాం గ్రామానికి చెందిన జాదవ్ లతాబాయి (54) ఉట్నూర్లోని ఎస్టీ హాస్టల్లో ప్రభుత్వ కామాటిగా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం తీవ్ర ఎండల ధాటికి ఆమె అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో సాయంత్రం కన్ను మూశారు. ఆమె మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. లతాబాయి మరణవార్త తెలుసుకున్న ఐటీడీఏ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఆమె అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ పరిస్థితిని గమనించిన ఐటీడీఏ హెచ్డబ్ల్యూఓలు కార్తీక్, రవి, రిటైర్డ్ ఈఈ భీంరావుల ఆధ్వర్యంలో ఐటీడీఏ ఉద్యోగులంతా కలిసి దహన సంస్కారాల కోసం రూ.30వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, గ్రామ సర్పంచ్ రాథోడ్ వినేష్, గ్రామస్తులు పాల్గొని లతాబాయి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా హమీద్ సేవలు

- ఆరోగ్య సమస్యల మధ్యనూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల మంజూరుకు కృషి

**రాజముద్ర న్యూస్, గంభీరావుపేట:** గంభీరావుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ వ్యక్తిగత ఆరోగ్య సమస్యలను పక్కనబెట్టి ప్రజా సేవలో నిమగ్నమవుతున్నారు. గత రెండు నెలలుగా తీవ్ర కాలు నొప్పితో బాధపడుతున్నప్పటికీ ప్రజల సమస్యల పరిష్కారమే తన బాధ్యతగా భావిస్తూ నిరంతరం ప్రజల మధ్యలో ఉంటున్నారు. ప్రజలకు సంబంధించిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు వివిధ కారణాలతో పెండింగ్లో ఉండటంతో ఆ సమస్యలను పరిష్కరించేందుకు హమీద్ రాష్ట్ర సచివాలయానికి వెళ్లి సంబంధిత అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పెండింగ్లో ఉన్న చెక్కులు ఎక్కడ నిలిచిపోయాయో, వాటి ఆలస్యానికి గల కారణాలేమిటో తెలుసుకొని అధికారులతో చర్చించారు. చెక్కుల్లో ఉన్న సాంకేతిక, పరిపాలనా లోపాలను సరిచేయించడంతో పాటు కొత్తగా మరో 30 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు చేయించడంలో కీలకపాత్ర పోషించినట్లు తెలిపారు. ఆరోగ్య పరిస్థితి సహకరించకపోయినా ప్రజల కోసం కృషి చేస్తున్న హమీద్ సేవలను స్థానిక ప్రజలు అభినందిస్తూ ఆయన అంకితభావాన్ని ప్రశంసిస్తున్నారు.

# పంట అవశేషాలను కాల్చవద్దు.. భూమి సారం కోల్పోతుంది

**బయో డి మందులతో కంపోస్టుగా మార్చుకోండి: ఎంఏఓ సీతారాం రెడ్డి**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** వేసవిలో పొలాల్లో మిగిలిపోయిన పంట అవశేషాలకు నిప్పు పెట్టడం వల్ల రైతులు తెలియకుండానే భూమి సారాన్ని నాశనం చేస్తున్నారని తిరుమలాయపాలెం మండల వ్యవసాయ అధికారి నా రెడ్డి సీతారాం రెడ్డి తెలిపారు. పంట అవశేషాలను కాల్చకుండా సహజ ఎరువులుగా మార్చుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు.

**భూమి ఉత్పాదకతకు దెబ్బ:**
పంట అవశేషాలను కాల్చడం వల్ల నేలలో ఉండే సూక్ష్మ జీవులు నశించిపోయి భూమి ఉత్పాదకత తగ్గిపోతుందని ఎంఏఓ పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులు వరి, మొక్కజొన్న, పత్తి కోత అనంతరం మిగిలిన అవశేషాలను తొందరపాటుతో కాల్చివేస్తున్నారని, ఇది దీర్ఘకాలంలో భూమికి నష్టం కలిగించే చర్య అని హెచ్చరించారు. నేలలోని సేంద్రియ పదార్థాలు నశించి భూమి క్రమంగా బలహీనపడుతుందన్నారు.

**అగ్నిప్రమాదాల ముప్పు:**
వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా పొలాల్లో పెట్టిన మంటలు అదుపుతప్పి సమీప వ్యవసాయ భూములు, చెట్లు, విద్యుత్ స్తంభాలు, గడ్డి గోతులు, పశువుల మేత ప్రాంతాలకు వ్యాపించే ప్రమాదం ఉందని ఎంఏఓ తెలిపారు. చిన్న నిర్లక్ష్యం పెద్ద అగ్నిప్రమాదాలకు దారితీస్తోందన్నారు.

**బయో డీకంపోజర్ వాడండి:**
రైతులు పంట అవశేషాలను కాల్చకుండా వాటిని భూమిలో కలిపి సహజ ఎరువులుగా మార్చుకోవాలని సూచించారు. బయో డీకంపోజర్ మందులు, జీవామృతం, ఘన జీవామృతం వంటి సేంద్రియ పద్ధతులను ఉపయోగించడం ద్వారా తక్కువ ఖర్చుతో నేల సారాన్ని పెంచుకోవచ్చన్నారు. ట్రాక్టర్ రోటావేటర్ సహాయంతో అవశేషాలను భూమిలో కలిపితే నేలలో సేంద్రియ కార్బన్ పెరిగి తదుపరి పంటకు మంచి దిగుబడి వస్తుందని వివరించారు.

**ఎస్ఐ హెచ్చరిక: కాలిస్తే కఠిన చర్యలు**
తిరుమలాయపాలెం ఎస్ఐ కూచిపూడి జగదీష్ మాట్లాడుతూ వేసవిలో పంట అవశేషాలను కాల్చడం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. పొలాల సమీపంలో విద్యుత్ తీగలు, పొడి గడ్డి ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. కావాలని పంట అవశేషాలకు నిప్పు పెట్టినట్లు నిర్ధారణకు వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రమాదాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్, డిప్యూటీ తహసీల్దార్ సుధీర్, ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# శాశ్వత పరిష్కారం కోసం..





- రాంకీ సంస్థ ప్రతినిదులతో చర్చలు
- మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి,మల్కాజ్గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి

**జవహర్ నగర్, రాజముద్ర న్యూస్:** మేడ్చల్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం డప్పింగ్ యార్డ్ ను సందర్శించి డప్పింగ్ యార్డ్ నిర్వహిస్తున్న రాంకీ సంస్థ ప్రతినిదులతో చర్చలు జరిపడం జరిగింది. రోజు వారిగా వచ్చే చెత్త ఎంత శుద్దీకరణ కోసం ఏలాంటి పద్ధతులు అవలంబిస్తున్నారు. ప్రజలకు నష్టం జరగకుండా ఉండాలంటే ఏం చేయాలనేదాని మీద అద్యయనం చేయాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, మల్కాజ్గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి,డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్,మాజీ మేయర్ కావ్య, మాజీ ప్రజాప్రతినిధులు,జేఏసీ సభ్యులు,అధికారులు పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ పత్తి విత్తనాల ముఠా గుట్టురట్టు

- 5.45 క్వింటాళ్ల నకిలీ విత్తనాలు స్వాధీనం
- ఇద్దరు నిందితుల అరెస్ట్, రిమాండ్కు తరలింపు



**రాజముద్ర న్యూస్, కాగజ్నగర్:** పోలీసులు నకిలీ పత్తి విత్తనాల ముఠాను గుట్టురట్టు చేశారు. కొమరంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల అక్రమ రవాణా, విక్రయాలపై పోలీసులు చేపట్టిన ప్రత్యేక నిఘాలో కీలక విజయం లభించింది. సిర్పూర్ (యు) పోలీస్ స్టేషన్ సమీపంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో భారీ మొత్తంలో నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ నితిక పంత్ తెలిపారు. శుక్రవారం సిర్పూర్ (యు) పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ఎస్సై విక్రమ్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద నుంచి 152 ప్యాకెట్లలో మొత్తం 68 కిలోల పత్తి విత్తనాలు లభించాయి. ఒక్కో ప్యాకెట్లో సుమారు 450 గ్రాముల చొప్పున విత్తనాలు ఉండగా, వాటిపై ప్రభుత్వ అనుమతి గుర్తులు, క్యూ ఆర్ కోడ్, హలోగ్రామ్, లాట్ నంబర్ వంటి వివరాలు లేకపోవడంతో అనుమానం వ్యక్తమైంది. వెంటనే వ్యవసాయ శాఖ అధికారి ఆనందరావుకు సమాచారం అందించగా, ఆయన పరిశీలించి వాటిని నకిలీ పత్తి విత్తనాలుగా నిర్ధారించారు. అనంతరం పంచనామా నిర్వహించి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు నమోదు చేశారు. ఈ కేసును ఆసిఫాబాద్ సబ్ డివిజన్ డీఎస్పీ అశోక్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేయగా, గత రెండు నెలలుగా సిర్పూర్ మండల పరిధిలో రైతులకు అక్రమంగా నకిలీ పత్తి విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు బయటపడింది. దర్యాప్తులో భాగంగా నిందితుడు నైతం జంగు ఇంటి వద్ద మరో 1100 ప్యాకెట్లలో 4.90 క్వింటాళ్ల నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 5.45 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కేసులో మధ్యప్రదేశ్కు చెందిన ప్రధాన నిందితుడు మంగునాథ్, సిర్పూర్(యు)కు చెందిన నైతం జంగులను అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించినట్లు వివరించారు. ఈ నకిలీ విత్తనాల ముఠాను పట్టుకోవడంలో కృషి చేసిన డీఎస్పీ అశోక్, ఎస్సై విక్రమ్, కానిస్టేబుళ్లు నాగేంద్రబాబు, నాగేంద్రలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ అనుమతి ఉన్న విక్రయ కేంద్రాల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.

# పోడు రైతుల సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్కే చిత్తశుద్ధి

- ఎమ్మెల్యే హరీష్బాబు హామీలు ఏమయ్యాయని ప్రశ్నించిన దోబ్బల మంగేష్



**రాజముద్ర న్యూస్, కాగజ్నగర్:** సిర్పూర్ నియోజకవర్గంలో పోడు రైతులు అటవీ అధికారుల వేధింపులకు గురవుతున్నప్పటికీ వారి సమస్యల పరిష్కారంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్బాబు పూర్తిగా విఫలమయ్యారని బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకుడు దోబ్బల మంగేష్ ఆరోపించారు. రైతుల పక్షాన నిజాయితీగా పోరాడుతున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని పేర్కొన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దిమ్మ, కర్జెల్లి గ్రామాల్లో ఫారెస్ట్ అధికారుల వేధింపులకు గురైన పోడు రైతుల సమస్యలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందన వచ్చిందన్నారు. వారం రోజుల్లోనే ఎస్సీ, ఎస్టీ కమిషన్ను గ్రామాలకు పంపించి బాధిత రైతులతో ముఖాముఖి మాట్లాడించి సమస్యల పరిష్కారానికి చర్యలు ప్రారంభించారని తెలిపారు. అలాగే రైతుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి లిఖితపూర్వకంగా తీసుకెళ్తామని అధికారులు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తేనే పోడు భూములకు పట్టాలు ఇస్తామని హామీలు ఇచ్చిన ఎమ్మెల్యే హరీష్బాబు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇచ్చిన హామీలపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బండి భగీరథ్ పోక్సో కేసు విషయంలో బీజేపీ నాయకులు నిందితులను కాపాడేందుకు సోషల్ మీడియాలో దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. మైనర్ బాలికకు జరిగిన అన్యాయంపై స్పందించని వారికి 'జై శ్రీరామ్' అని చెప్పే నైతిక హక్కు లేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీజేపీ నాయకులకు పరోక్షంగా సహకరిస్తోందని విమర్శించారు. పోడు రైతులను మోసం చేసిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.




# గైక్వాడ్‌కు భారీ జరిమానా

## చెన్నై ప్లేఆఫ్స్ ఆశలకు ముగింపు

**అహ్మదాబాద్, మే 22 :** చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు ఐపీఎల్ నిర్వాహకులు భారీ జరిమానా విధించారు. గుజరాత్ టైటాన్స్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై జట్టు నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయకపోవడంతో స్లో ఓవర్ రేట్ నేరం కింద ఈ చర్యలు తీసుకున్నారు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం ఇది చెన్నై జట్టుకు రెండో తప్పిదంగా పరిగణించబడింది. దీంతో రుతురాజ్ గైక్వాడ్‌పై రూ.24 లక్షల జరిమానా విధించినట్లు ఐపీఎల్ అధికారిక ప్రకటనలో తెలిపింది. అలాగే జట్టులోని మిగతా ఆటగాళ్లు, ఇంపాక్ట్ ప్లేయర్‌పై కూడా రూ.6 లక్షలు లేదా మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించనున్నట్లు వెల్లడించింది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే, ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్‌కు ఈ సీజన్ నిరాశాజనకంగా ముగిసింది. గుజరాత్ టైటాన్స్ చేతిలో 89 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైన చెన్నై ప్లేఆఫ్స్ ఆశలను పూర్తిగా కోల్పోయింది. లీగ్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. ముందుగా బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 229 పరుగుల భారీ స్కోరు చేసింది. సాయి సుదర్శన్ 84 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడగా, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 64 పరుగులతో జట్టుకు బలమైన ఆరంభం అందించాడు. చివర్లో జోస్ బట్లర్ 57 పరుగులతో మెరిపించాడు. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నై జట్టు గుజరాత్ బౌలర్ల ధాటికి కుప్పకూలింది. మహ్మద్ సిరాజ్, కగిసో రబాడ, రషీద్ ఖాన్ అద్భుత బౌలింగ్‌తో చెన్నై బ్యాటింగ్‌ను చీల్చిచెండాడారు. శివం దూబే 47 పరుగులతో కొంత పోరాడినప్పటికీ, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. చెన్నై జట్టు కేవలం 13.4 ఓవర్లలోనే 140 పరుగులకు ఆలౌటైంది. ఈ విజయంతో గుజరాత్ టైటాన్స్ పాయింట్ల పట్టికలో రెండో స్థానాన్ని మరింత బలపరుచుకోగా, ప్లేఆఫ్స్‌కు ముందే తమ జోరును తిరిగి అందుకుంది. అద్భుత బౌలింగ్ ప్రదర్శన చేసిన మహ్మద్ సిరాజ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.




# కామెంటరీ బాక్స్‌లో స్వేచ్ఛ లేదన్న శివరామకృష్ణన్

**చెన్నై, మే 22 :** క్రికెట్ కామెంటరీ వెనుక ఉన్న కఠిన పరిస్థితులపై భారత మాజీ క్రికెటర్ లక్ష్మణ్ శివరామకృష్ణన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మ్యాచ్‌ల సమయంలో కామెంటరీ చెప్పేవారికి పూర్తి స్వేచ్ఛ ఉండదని, బయటకు కనిపించే పరిస్థితులకు భిన్నంగా కామెంటరీ బాక్స్‌లో తీవ్ర ఒత్తిడి ఉంటుందని ఆయన వెల్లడించారు. కామెంటరీ బాక్స్‌లో కూర్చొని స్వేచ్ఛగా మాట్లాడుతున్నారని చాలామంది అభిమానులు భావిస్తారని, కానీ వాస్తవానికి అక్కడ పరిస్థితి నరకంలా ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. మైక్ ఆన్ చేసే ముందు నుంచే ప్రసార సంస్థల ప్రతినిధులు, క్రికెట్ బోర్డు అధికారులు కొన్ని స్పష్టమైన మార్గదర్శకాలు ఇస్తారని తెలిపారు. కొంతమంది ఆటగాళ్లను ఎక్కువగా విమర్శించకూడదని, వివాదాస్పద నిర్ణయాలు లేదా మైదాన పరిస్థితులపై ప్రతికూల వ్యాఖ్యలు చేయవద్దని ముందుగానే హెచ్చరిస్తారని చెప్పారు. తాము అనుకున్నది స్వేచ్ఛగా చెప్పే పరిస్థితి ఉండదని, ప్రసార సంస్థలు కోరుకున్న అభిప్రాయాలనే ఎక్కువగా చెప్పాల్సి వస్తుందని శివరామకృష్ణన్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పెద్ద ఇరవై ఓవర్ల లీగ్‌లు, అంతర్జాతీయ ద్వైపాక్షిక సిరీస్‌ల సమయంలో ఈ నియంత్రణ మరింత ఎక్కువగా ఉంటోందని ఆరోపించారు. నిష్పక్షపాతంగా లోపాలను ఎత్తిచూపాలని ప్రయత్నిస్తే తదుపరి సిరీస్‌లలో అవకాశాలు తగ్గించేలా పరోక్ష హెచ్చరికలు వస్తాయని ఆయన పేర్కొన్నారు. కెరీర్, ఆర్థిక భద్రత కోసం చాలామంది కామెంటేటర్లు ప్రసార సంస్థలు చెప్పిన విధంగానే మాట్లాడాల్సి వస్తోందని విమర్శించారు.




# గెలిచినా నిరాశే!

### బెంగళూరు పై 55 పరుగుల తేడాతో హైదరాబాద్ ఘన విజయం

### ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, క్లాసెన్ విధ్వంసకర బ్యాటింగ్

### రన్ రేట్ తో పాయింట్ల పట్టికలో మూడో స్థానానికే పరిమితం

### ప్లే ఆఫ్స్ లో భాగంగా ముందుగా ఎలిమినేటర్ మ్యాచ్ ఆడనున్న సన్ రైజర్స్

సొంత గడ్డపై సన్‌రైజర్స్ హైదరాబాద్ సింహంలా గర్జించింది. రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును చిత్తుగా ఓడించింది. బ్యాటింగ్, బౌలింగ్ లో సత్తా చాటిన హైదరాబాద్ 55 పరుగుల భారీ తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. అయితే ఇంత భారీ విజయం సాధించినా నెట్ రన్ రేట్ లెక్కల్లో వెనుకబడటంతో పాయింట్ల పట్టికలో టాప్ 2 స్థానాల్లో నిలవలేకపోయింది. దీంతో ప్లే ఆఫ్స్ లో ఫైనల్ కు చేరేందుకు అదనపు అవకాశం కోల్పోయి ఎలిమినేటర్ మ్యాచ్ ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## హైదరాబాద్ బ్యాటింగ్ విధ్వంసం..

హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో శుక్రవారం జరిగిన ఈ కీలక మ్యాచ్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు, మిడిలార్డర్ బ్యాటర్లు ఆది నుంచే బెంగళూరు బౌలర్లపై విరుచుకుపడ్డారు. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి ఏకంగా 255 పరుగుల భారీ స్కోరు సాధించింది. హైదరాబాద్ బ్యాటర్లలో ఇషాన్ కిషన్ 46 బంతుల్లో 79 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలవగా.. అభిషేక్ శర్మ కేవలం 22 బంతుల్లో 56 పరుగులు చేసి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఆఖర్లో హెన్రిచ్ క్లాసెన్ 24 బంతుల్లోనే 51 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. బెంగళూరు బౌలర్లలో రసిఖ్ సలామ్ 4 ఓవర్లలో 52 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. కృనాల్ పాండ్యా 2 ఓవర్లలో 24 పరుగులిచ్చి 1 వికెట్, సుయాష్ శర్మ 3 ఓవర్లలో 36 పరుగులిచ్చి 1 వికెట్ పడగొట్టారు.

## సాధారణ స్కోరుకే బెంగళూరు పరిమితం..

256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 200 పరుగులకే పరిమితమైంది. బ్యాటర్లు రజత్ పాటిదార్ 39 బంతుల్లో 56 పరుగులు, వెంకటేష్ అయ్యర్ 19 బంతుల్లో 44 పరుగులు చేసి కాస్త పోరాడే ప్రయత్నం చేశారు. చివర్లో కృనాల్ పాండ్యా 31 బంతుల్లో 41 పరుగులు చేసి అజేయంగా నిలిచినా లాభం లేకపోయింది. భారీ లక్ష్య ఛేదనలో హైదరాబాద్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి బెంగళూరు బ్యాటర్లను కట్టడి చేశారు. ఈషాన్ మలింగ 4 ఓవర్లలో 33 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. ట్రావిస్ హెడ్ 1 ఓవర్లో 7 పరుగులిచ్చి 1 వికెట్, సాకిబ్ హుస్సేన్ 4 ఓవర్లలో 31 పరుగులిచ్చి 1 వికెట్ తీసి హైదరాబాద్ కు 55 పరుగుల భారీ విజయాన్ని అందించారు.

## రన్ రేట్ దెబ్బ.. ఎలిమినేటర్ కష్టాలు..

లీగ్ దశలో తమ ఆఖరి మ్యాచ్ ఆడిన సన్ రైజర్స్ కు ఈ విజయం నిరాశనే మిగిల్చింది. పాయింట్ల పట్టికను పరిశీలిస్తే బెంగళూరు, గుజరాత్, హైదరాబాద్ జట్లు మూడూ చెరో 14 మ్యాచ్ లు ఆడి 9 విజయాలు, 5 ఓటములతో సమానంగా 18 పాయింట్లు సాధించాయి. కానీ పాయింట్లు సమానమైనప్పుడు నెట్ రన్ రేట్ ఇక్కడ కీలకంగా మారింది. బెంగళూరు ప్లస్ 0.783 రన్ రేట్ తో మొదటి స్థానంలో, గుజరాత్ ప్లస్ 0.695 రన్ రేట్ తో రెండో స్థానంలో నిలిచాయి. భారీ విజయం సాధించినా హైదరాబాద్ ప్లస్ 0.524 రన్ రేట్ తో మూడో స్థానానికే పరిమితమైంది. నిబంధనల ప్రకారం పాయింట్ల పట్టికలో మొదటి 2 స్థానాల్లో నిలిచిన జట్లకు




ఫైనల్ చేరేందుకు 2 అవకాశాలు ఉంటాయి. బెంగళూరు, గుజరాత్ జట్లు ఇప్పుడు నేరుగా క్వాలిఫయర్ 1 ఆడతాయి. అందులో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్ చేరుతుంది. మూడో స్థానంలో నిలిచిన సన్ రైజర్స్ హైదరాబాద్ ఇప్పుడు నాలుగో స్థానంలో నిలిచే జట్టుతో ఎలిమినేటర్ మ్యాచ్ ఆడాల్సి ఉంటుంది. ఈ ఎలిమినేటర్ మ్యాచ్ లో గెలిస్తేనే క్వాలిఫయర్ 2 ఆడే అవకాశం దక్కుతుంది. ఒకవేళ ఓడిపోతే మాత్రం నేరుగా టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. పట్టికలో టాప్ 2 లో నిలిచేందుకు సన్ రైజర్స్ మరింత భారీ తేడాతో గెలవాల్సి ఉండగా.. ఆ అవకాశం తృటిలో చేజారిపోయింది.

# పాక్ హాకీ జట్టుకు ఆర్థిక కష్టాలు

**ఇస్లామాబాద్, మే 22 :** పాకిస్థాన్ హాకీ జట్టు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. ఆటగాళ్లకు సరైన నిధులు అందించడంలో పాకిస్థాన్ హాకీ సమాఖ్య విఫలమవుతుండటంతో ప్లేయర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పెండింగ్ బకాయిల కోసం ఎదురుచూస్తున్న సమయంలో శిక్షణ శిబిరంలో ఇచ్చే రోజువారీ భత్యాన్ని భారీగా తగ్గించడం వివాదాస్పదంగా మారింది. ప్రాక్టీస్ శిబిరాల సమయంలో ఆటగాళ్లకు అందించే రోజువారీ భత్యాన్ని మూడు వేల పాకిస్థాన్ రూపాయిల నుంచి వెయ్యి పాకిస్థాన్ రూపాయిలకు తగ్గించినట్లు సమాచారం. భారత కరెన్సీలో ఇది సుమారు మూడు వందల ముప్పై ఐదు రూపాయలు మాత్రమే కావడంతో ప్లేయర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న తమకు ఇది అవమానకరమని అభిప్రాయపడుతున్నారు. అంతర్జాతీయ పర్యటనల సమయంలో ఆటగాళ్లు, సహాయక సిబ్బందికి రోజుకు నూట పది డాలర్లు చెల్లిస్తామని పాకిస్థాన్ హాకీ సమాఖ్య ప్రకటించింది. అయితే గతంలో కూడా ఇలాంటి హామీలు ఇచ్చి అమలు చేయలేదని ప్లేయర్లు ఆరోపిస్తున్నారు. తమకు రావాల్సిన బకాయిలు ఇంకా చెల్లించలేదని, ముందుగా పెండింగ్ డబ్బులు ఇచ్చిన తర్వాతే సమాఖ్య మాటలను నమ్ముతామని వారు వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఆగస్టు 15 నుంచి హాకీ ప్రపంచకప్ 2026 ప్రారంభం కానుంది. అందుకు ముందు జూన్ 13 నుంచి 27 వరకు జరిగే హాకీ ప్రో లీగ్ పోటీల్లో పాకిస్థాన్ జట్టు పాల్గొననుంది. ఈ టోర్నీలో బెల్జియం, స్పెయిన్, ఇంగ్లండ్, భారత్ జట్లతో పాకిస్థాన్ తలపడాల్సి ఉంది. ప్రపంచకప్‌కు ముందు జట్టు సన్నద్ధం కావాల్సిన సమయంలో ఆటగాళ్లు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవడం ఆ దేశ హాకీ పరిస్థితిని ప్రతిబింబిస్తోందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# సీఎస్కే వైఫల్యాలపై సెహ్వాగ్ వ్యాఖ్యలు

**చెన్నై, మే 22 :** ఐపీఎల్ 2026లో చెన్నై జట్టు ప్రయాణం ప్లే ఆఫ్స్‌కు ముందే ముగియడంపై భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ తీవ్రంగా స్పందించాడు. గుజరాత్ చేతిలో కీలక మ్యాచ్‌లో ఘోర పరాజయం పాలవడంతో చెన్నై వరుసగా మూడోసారి తొలి నాలుగు స్థానాల్లో నిలవలేకపోయింది. ఈ సీజన్‌లో జట్టు ప్రదర్శనపై అభిమానులు, మాజీ ఆటగాళ్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చెన్నై జట్టు ఈసారి ఎదుర్కొన్న అతిపెద్ద సమస్య బ్యాటింగ్ విభాగమని సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. మహేంద్ర సింగ్ ధోని, డేవాల్డ్ బ్రెవిస్, ఆయుష్ మాత్రే, ఖలీల్ అహ్మద్ వంటి కీలక ఆటగాళ్లు గాయాల కారణంగా జట్టుకు దూరమవడం ప్రభావం చూపిందని పేర్కొన్నాడు. ముఖ్యంగా ధోని లేకపోవడం జట్టులో స్పష్టంగా కనిపించిందని వ్యాఖ్యానించాడు. అయితే ప్రధాన సమస్య మాత్రం బ్యాటర్లలో నిలకడ లేకపోవడమేనని సెహ్వాగ్ తెలిపాడు. ఇతర జట్లతో పోలిస్తే చెన్నై బ్యాటర్లు స్థిరంగా పరుగులు



చేయలేకపోయారని, 180 నుంచి 190 పరుగుల లక్ష్యాలను ఛేదించడంలో విఫలమయ్యారని పేర్కొన్నాడు. తొలుత బ్యాటింగ్ చేసిన సందర్భాల్లో కూడా జట్టు 160 పరుగుల వద్దే ఆగిపోయిందని గుర్తు చేశాడు. ముఖ్యంగా మధ్య వరుస బ్యాటర్లు పూర్తిగా నిరాశపరిచారని సెహ్వాగ్ విమర్శించాడు. గత సీజన్‌లో ఆకట్టుకున్న డేవాల్డ్ బ్రెవిస్ ఈసారి అంచనాలకు తగ్గట్టు రాణించలేకపోయాడని అన్నాడు. సర్ఫరాజ్ ఖాన్, ఆయుష్ మాత్రే, ఉర్విల్ పటేల్ వంటి ఆటగాళ్లు కూడా నిలకడగా ఆడలేకపోయారని వివరించాడు. బౌలింగ్ విభాగం కూడా ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేదని అభిప్రాయపడ్డాడు. ఐదుసార్లు టైటిల్ గెలిచిన చెన్నై జట్టు చివరిసారిగా 2023లో మహేంద్ర సింగ్ ధోని నాయకత్వంలో ట్రోఫీని అందుకుంది. అయితే ఈ సీజన్‌లో ధోని ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోవడం జట్టుకు పెద్ద దెబ్బగా మారింది. ప్రస్తుతం జట్టు మార్పుల దశలో ఉందని, కొత్త ఆటగాళ్లు నిలకడ సాధించేందుకు సమయం అవసరమని కోచ్ ఇప్పటికే వెల్లడించిన విషయం తెలిసిందే.

# 'పెద్ది' పాట ప్రోమోకు భారీ స్పందన



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది'పై రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ క్రీడా ప్రధాన కథా చిత్రం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలను చిత్రబృందం మరింత వేగవంతం చేసింది. రేపు భోపాల్‌లో భారీ స్థాయిలో సంగీత వేడుక నిర్వహించనున్న నేపథ్యంలో చిత్రబృందం అభిమానులకు ప్రత్యేక సర్‌ప్రైజ్ ఇచ్చింది. సినిమాలోని ప్రత్యేక గీతం "హెల్లల్లలో" పాటకు సంబంధించిన ప్రోమోను విడుదల చేసింది. ఈ ప్రోమోలో రామ్ చరణ్, శృతి హాసన్ వేసిన ఉత్సాహభరితమైన స్టెప్పులు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. విడుదలైన కొద్ది సేపటికే ఈ ప్రోమో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పూర్తి పాటను మార్చి 23న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ ప్రత్యేక గీతానికి ప్రముఖ గేయరచయిత అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, ప్రపంచ ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ సంగీతాన్ని సమకూర్చారు. రెహమాన్ సంగీతం అంటేనే ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఆసక్తి ఉంటుంది. అందులోనూ ఇది ప్రత్యేక గీతం కావడంతో ఈ పాటపై భారీ అంచనాలు నెలకొన్నాయి. రేపు జరగనున్న సంగీత వేడుకలో ఈ పాటను అధికారికంగా విడుదల చేయనున్నారు. ఇక ఈ పాటలో మరో కథానాయిక కూడా కనిపించనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే ఆమె ఎవరు అన్న విషయాన్ని మాత్రం చిత్రబృందం గోప్యంగా ఉంచింది. దీంతో అభిమానుల్లో ఆసక్తి, ఉత్కంఠ మరింత పెరిగింది. భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో శివరాజ్ కుమార్, జగపతి బాబు, బొమన్ ఇరానీ, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వృద్ధి సినిమాస్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. వచ్చే ఏడాది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా, ఇప్పుడు "హెల్లల్లలో" పాటతో మరింత చర్చనీయాంశంగా మారింది.



# వినాయక చవితికి జైలర్-2?

'టైగర్ కా హుకుం'.. అంటూ ముత్తువేల్ పాండియన్‌గా మరోమారు బాక్సాఫీస్ బరిలో సందడి చేయనున్నారు కథానాయకుడు రజనీకాంత్. ఆయన 'జైలర్'లో ఇదే పాత్రతో అందర్నీ అలరించిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ విజయవంతమైన సినిమాకి కొనసాగింపుగా 'జైలర్ 2' సిద్ధమైంది. నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మించింది. మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్ తదితరులు ప్రత్యేక పాత్రలు పోషించారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాని వినాయక చవితి సందర్భంగా సెప్టెంబరు రెండో వారంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. దీని కోసం రెండు తేదీల్ని పరిశీలిస్తున్నట్లు తెలిసింది. దీనికి తగ్గట్లే ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్ని వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. త్వరలోనే విడుదల తేదీపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రానికి అనిరుధ్ సంగీతమందిస్తుండగా.. విజయ్ కార్తిక్ కన్నన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించారు.

# '1 నేనొక్కడినే'

## రీ-రిలీజ్‌కు భారీ రెస్పాన్స్

సమ్మర్ సీజన్‌లో పెద్ద సినిమాల విడుదలలు లేకపోవడంతో టాలీవుడ్‌లో రీ-రిలీజ్‌ల ట్రెండ్ మరింత ఊపందుకుంది. స్టార్ హీరోల పాత సూపర్ హిట్ చిత్రాలను మళ్లీ థియేటర్లలో చూసేందుకు అభిమానులు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో, సూపర్ స్టార్ మహేశ్ బాబు కెరీర్‌లో ప్రత్యేక గుర్తింపు పొందిన '1 నేనొక్కడినే' చిత్రం మరోసారి వెండితెరపై సందడి చేయడానికి సిద్ధమవుతోంది. ఈ సినిమాను అత్యాధునిక 4కే అల్ట్రా హెచ్‌డీ ఫార్మాట్‌లో, మెరుగైన సౌండ్ క్వాలిటీతో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రీ-రిలీజ్ చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. లెజెండరీ నటుడు సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా మే 31న ఈ చిత్రాన్ని మళ్లీ ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన స్పెషల్ 4కే ట్రైలర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ట్రైలర్ చూసిన అభిమానులు థియేటర్లలో మరోసారి మహేశ్ మ్యాజిక్ చూడబోతున్నామని ఉత్సాహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గౌతమ్ ఘట్టమనేని పాత్రకు సంబంధించిన సన్నివేశాలు అభిమానులను మరింత ఆకట్టుకుంటున్నాయి. క్రియేటివ్ దర్శకుడు సుకుమార్ తెరకెక్కించిన ఈ చిత్రం 2014 సంక్రాంతి కానుకగా విడుదలైంది. అప్పట్లో తెలుగు సినీ ప్రేక్షకులకు సరికొత్త సైకాలజికల్ థ్రిల్లర్ అనుభూతిని అందించిన ఈ సినిమా విడుదల సమయంలో ఆశించిన స్థాయిలో వాణిజ్య విజయం సాధించకపోయినా, కాలక్రమేణా కల్ట్ క్లాసిక్‌గా గుర్తింపు తెచ్చుకుంది. మైండ్ గేమ్ థ్రిల్లర్ కథనం, క్లిష్టమైన స్క్రీన్‌ప్లే, మహేశ్ బాబు నటన ఈ చిత్రాన్ని ప్రత్యేక స్థాయికి తీసుకెళ్లాయి.సినిమాలో మహేశ్ బాబు సరసన బాలీవుడ్ నటి కృతి సనన్ కథానాయికగా నటించగా, ఆమెకు ఇదే తొలి తెలుగు చిత్రం. అలాగే మహేశ్ బాబు తనయుడు గౌతమ్ ఘట్టమనేని చిన్నప్పటి మహేశ్ పాత్రలో కనిపించి ప్రేక్షకులను మెప్పించాడు. 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట, అనిల్ సుంకర ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో రీ-రిలీజ్ సినిమాలకు వస్తున్న స్పందన దృష్ట్యా '1 నేనొక్కడినే' కూడా మరోసారి థియేటర్లలో భారీ హంగామా సృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా మహేశ్ అభిమానులు ఈ చిత్రాన్ని పెద్ద ఎత్తున సెలబ్రేట్ చేసేందుకు సిద్ధమవుతున్నారు.



# దిశా పఠాని ఫిట్‌నెస్ సీక్రెట్స్ ఇవే..

బాలీవుడ్ నటి దిశా పఠాని తన ఫిట్‌నెస్, కండరాల దృఢత్వం కోసం అనుసరించే వ్యాయామాల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించింది. తక్కువ బరువులతో ఎక్కువ రెప్స్ చేయడం కంటే, ఎక్కువ బరువులతో తక్కువ రెప్స్ చేయడం వల్ల కండరాల బలం వేగంగా పెరుగుతుందని ఆమె తెలిపింది. కేవలం బరువు తగ్గడానికే కాదు, శారీరకంగా మరియు మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు కూడా క్రమం తప్పకుండా వర్కవుట్స్ చేయడం ఎంతో అవసరమని పేర్కొంది. దిశా ప్రకారం, కండరాల పెరుగుదల మరియు అప్పర్ బాడీ బలం కోసం "షోల్డర్ ప్రెస్" అత్యుత్తమ వ్యాయామాల్లో ఒకటి. ఈ వ్యాయామాన్ని నిల్చుని లేదా కూర్చుని చేయవచ్చని ఆమె చెప్పింది. రెండు చేతుల్లో డంబెల్స్ పట్టుకుని చేతులను పైకి ఎత్తి మళ్లీ కిందికి దించుతూ చేసే ఈ వ్యాయామం భుజాలు, చేతులు, కోర్ మజిల్స్‌పై మంచి ప్రభావం చూపిస్తుందని వివరించింది. అలాగే, హెవీ వర్కవుట్స్‌కు ముందు వామప్ చేయడం తప్పనిసరి అని దిశా సూచించింది. ఏరోబిక్ వ్యాయామాలు, స్ట్రెచింగ్‌లతో శరీరాన్ని ముందుగా సిద్ధం చేయడం వల్ల గుండె వేగం, శరీర ఉష్ణోగ్రత సరిగ్గా నియంత్రణలో ఉంటాయని తెలిపింది. దీంతో గాయాల ప్రమాదం కూడా తగ్గుతుందని పేర్కొంది. పర్ఫెక్ట్ యాబ్స్ కోసం "క్రంచెస్" ఎంతో ఉపయోగపడతాయని ఆమె చెప్పింది. మ్యాట్‌పై పడుకుని మోకాళ్లను పైకి ఎత్తి, చేతులను తల వెనుక ఉంచుకుని నెమ్మదిగా పైకి లేస్తూ చేసే ఈ వ్యాయామం పొట్ట చుట్టూ ఉన్న కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుందని వివరించింది. క్రమం తప్పకుండా ఈ వ్యాయామం చేయడం వల్ల కడుపు భాగం దృఢంగా మారుతుందని తెలిపింది. ఫిట్‌నెస్ ప్రయాణంలో "సెల్ఫ్ మోటివేషన్" చాలా ముఖ్యమని దిశా పఠాని అభిప్రాయపడింది. ప్రతి రోజు చేసే వ్యాయామాలను ఫోటోలు లేదా వీడియోల రూపంలో రికార్డ్ చేసుకుంటే, కాలక్రమంలో శరీరంలో వచ్చిన మార్పులు స్పష్టంగా కనిపిస్తాయని చెప్పింది. అవే మరింత కష్టపడేందుకు ప్రేరణ ఇస్తాయని తెలిపింది. మహిళలు బరువులు ఎత్తితే మగవారిలా మారిపోతారనేది పూర్తిగా అపోహ మాత్రమేనని దిశా స్పష్టం చేసింది. సరైన శిక్షణ, సరైన ఆహారంతో హెవీ వర్కవుట్స్ చేయడం వల్ల మహిళలు మరింత ఫిట్‌గా, బలంగా మారతారని పేర్కొంది. క్రమశిక్షణతో వ్యాయామం చేస్తే ఆరోగ్యకరమైన జీవనశైలిని సులభంగా సాధించవచ్చని సూచించింది.



# కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఐశ్వర్యారాయ్

సందడిగా జరిగే కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఐశ్వర్యారాయ్ ఎప్పుడూ హైలైట్‌గా నిలుస్తుంటారు. అయితే ఈసారి ఆమె ఈ వేడుకకు హాజరుకావడం లేదంటూ కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. వీటికి చెక్ పెడుతూ ఈ బ్యూటీ తన కుమార్తెతో కలిసి ఫ్రాన్స్‌కు బయల్దేరారు. దీంతో కేన్స్‌లో చివరిరోజు ఐశ్వర్య సందడి చేయనున్నట్లు తెలుస్తోంది. ఒక ప్రముఖ బ్రాండ్ తరఫున ప్రతి ఏటా కేన్స్ రెడ్ కార్పెట్‌పై హొయలొలికించే ఐశ్వర్య ఈసారి ప్రచార చిత్రాల్లో కనిపించకపోవడంతో రూమర్స్ మొదలయ్యాయి. ఆమెకు బదులుగా ఈసారి బాలీవుడ్ నటి అలియా వెళ్లారంటూ కథనాలు వచ్చాయి. దీంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తాజాగా ఆమె ముంబయి ఎయిర్‌పోర్ట్‌లో కనిపించడంతో వాళ్లు సంబరపడుతున్నారు. ఈసారి ఈ కేన్స్ క్వీన్ ఎలాంటి లుక్స్‌తో మెస్మరైజ్ చేయనున్నారో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొదటిసారి 2002లో కేన్స్‌కు వెళ్లిన ఐష్.. అప్పటినుంచి ప్రతి ఏడాది తన ప్రత్యేకమైన దుస్తులతో మెరుస్తూనే ఉన్నారు. గతేడాది కూడా భారతీయత ఉట్టిపడేలా చీరతో వచ్చిన ఆమె.. నుదుటిన సింధూరంతో అందరి దృష్టిని ఆకర్షించారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు కేన్స్ వేదికగా తన లుక్‌తో మద్దతు ఇచ్చి సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా నిలిచారు.



Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com